31వ వసంతంలోకి

# చురకలు

కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్లా

శుక్రవారం,ఆగస్టు 14 ,2026 పేజీలు : 8

## ఏసీబీకి చిక్కిన బీర్‌పూర్ ఆర్ఐ

**-రూ.30 వేలు లంచం తీసుకుంటుండగా పట్టుకున్న ఏసీబీ అధికారులు**



**చురకలు విలేకరి, బీర్ పూర్, ఆగస్టు 13:** బీర్‌పూర్ మండల తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐగా విధులు నిర్వర్తిస్తున్న రాహుల్ లంచం తీసుకుంటూ గురువారం ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. ఏసీబీ డిఎస్పీ గట్ల మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం బీర్‌పూర్ మండలంలోని సిరిపూర్ కు చెందిన ఓ మహిళ 12 గుంటల భూమి సాదాబైనామా ద్వారా కొనుగోలు చేసి భూభారతిలో తాను కొనుగోలు చేసిన భూమికి పట్టా చేయాలని దరఖాస్తు చేసుకోగా, మండల తహసీల్దార్ ఈ విషయమై విచారణ జరిపి రిపోర్ట్ ఇవ్వాలని ఆర్ఐ రాహుల్ ను అదేశించారని తెలిపారు. ఆర్ఐ రాహుల్ విచారణ జరుపకుండా, రిపోర్ట్ ఇవ్వకుండా రూ. 30వేల లంచం డిమాండ్ చేశారని, దీంతో సదరు బాధితురాలు ఏసీబీని ఆశ్రయించగా, గురువారం బాధితురాలి నివాసం వద్ద ఆర్ఐ రాహుల్ రూ. 30 వేల లంచం తీసుకుంటూ పట్టుబడ్డారని తెలిపారు. ప్రభుత్వ అధికారులు లంచం డిమాండ్ చేస్తే నిర్భయంగా ఏసీబీని ఆశ్రయించాలని డిఎస్పీ కోరారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికీ నూతన పెన్షన్లు అందిస్తాం

- నూతన పెన్షన్ల కోసం ఆగస్టు 31లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి
- రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఆగస్టు 13:** అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ నూతన పెన్షన్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు.నూతన రేషన్ కార్డులు, నూతన పెన్షన్ల పంపిణీ పై గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయం సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ తో కలిసి మంత్రి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ ఎన్నో రోజులుగా నూతన పెన్షన్ల కోసం ఎదురుచూస్తున్న అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని తెలిపారు. వితంతువులు, ఒంటరి మహిళలు, ఫైలేరియా బాధితులు, డయాలసిస్ రోగులు, దివ్యాంగులు, చేనేత కార్మికులు, గీత కార్మికులు, తలసేమియా బాధితులు తదితర అర్హులైన వర్గాలకు నూతన పెన్షన్లు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అర్హులైన ప్రతి ఒక్కరూ ఆగస్టు 31లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని మంత్రి సూచించారు. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, మున్సిపాలిటీల్లో బిల్ కలెక్టర్ల ద్వారా దరఖాస్తులను స్వీకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేసేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా దరఖాస్తు చేసుకోవాలని, అర్హులైన ప్రతి లబ్ధిదారునికి నూతన పెన్షన్ అందించేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రస్తుతం జిల్లాలో 2,18,002 మంది లబ్ధిదారులకు ప్రతి నెల సుమారు రూ.47 కోట్ల మేర పెన్షన్లు ప్రభుత్వం అందిస్తోందని మంత్రి తెలిపారు. ప్రస్తుతం అందుతున్న పెన్షన్లకు అదనంగా నూతన పెన్షన్లను మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. అర్హులైన వారందరికీ సంతృప్త స్థాయిలో పెన్షన్లు అందించే విధంగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.గీత కార్మికులు, చేనేత కార్మికులకు 50 సంవత్సరాల వయస్సు నుంచే పెన్షన్ పొందే అవకాశం కల్పిస్తున్నామని, దివ్యాంగులకు 51 శాతం వైకల్యం నిబంధన ప్రకారం పెన్షన్ అందిస్తామని మంత్రి తెలిపారు. నూతన పెన్షన్లతో ప్రభుత్వ ఖజానాపై అదనపు భారం పడుతున్నప్పటికీ ప్రజా సంక్షేమమే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యత అని, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఈ నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. నూతన పెన్షన్లకు అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, సంబంధిత శాఖ మంత్రి సీతక్కకు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. గ్రామాల్లో పర్యటించిన సమయంలో కొత్త పెన్షన్ల కోసం అనేక మంది ప్రజలు తమకు విజ్ఞప్తులు చేశారని, వారి అవసరాలను దృష్టిలో ఉంచుకుని అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్ అందించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు.తెలంగాణలో-మిగతా 2లో

### స్వాతంత్ర దినోత్సవ వేడుకలు

## ఘనంగా నిర్వహించాలి



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఆగస్టు 13 :** జగిత్యాల జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్ లో ఆగస్టు 15 స్వాతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లను గురువారం జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, ఎస్పీ అశోక్ కుమార్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జగిత్యాల జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఆగస్టు 15 స్వాతంత్ర దినోత్సవానికి సంబంధించిన వేదిక నిర్మాణం, పతాకావిష్కరణ స్థలం, సాంస్కృతిక కార్యక్రమాల ప్రాంగణం, స్టాల్స్, పార్కింగ్, భద్రతా చర్యలు వంటి అంశాలను ప్రత్య క్షంగా సమీక్షించారు. జిల్లావ్యాప్తంగా జరిగే కార్యక్రమాలకు తగినట్లుగా ఏర్పాట్లు చేయాలని సంబంధిత విభాగాల అధికారులను ఆదేశించారు. రెవెన్యూ, పోలీస్ ,డిఆర్‌డిఓ, మున్సిపల్ సంబంధిత అధికారులతో సమన్వయం పెంచుతూ భద్రతా బందోబస్తును, ఏర్పాట్లను ఘనంగా నిర్వహించాలని సూచించారు.ఆహ్వానితులకు, విద్యార్థులకు మరియు ప్రజలకు అవసరమైన నీటి సదుపాయాలు, వైద్య సిబ్బంది, శానిటేషన్ వ్యవస్థలను ఏర్పాటుచేయాలని ఆదేశించారు. పతాకావిష్కరణ అనంతరం జరిగే అట్టహాసపూరిత పరేడ్, శకటాలు, సాంస్కృతిక కార్యక్రమాల ఏర్పాట్లను పరిశీలించారు.విధుల్లో ఎటువంటి నిర్లక్ష్యం చోటు చేసుకోకుండా అధికారులు కట్టుదిట్టంగా పర్యవేక్షించాలని -మిగతా 2లో

## సంక్షేమ పథకాల అమలును నిర్వీర్యం చేస్తున్న సీఎం

- కళ్యాణ లక్ష్మి - షాదీ ముబారక్ వెంటనే పునఃప్రారంభించాలి
- అర్హులకు వృద్ధాప్య, బీడీ పెన్షన్లు మంజూరు చేయాలి
- మాజీ మంత్రి టి.జీవన్ రెడ్డి



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఆగస్టు 13:** సంక్షేమ పథకాల అమలును సీఎం రేవంత్ రెడ్డి నిర్వీర్యం చేస్తున్నారని, కళ్యాణ లక్ష్మి – షాదీ ముబారక్ వెంటనే పునఃప్రారంభించాలని, అర్హులకు వృద్ధాప్య, బీడీ పెన్షన్లు మంజూరు చేయాలని మాజీ మంత్రి టి.జీవన్ రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత సురేష్ తో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిరుపేద కుటుంబాలకు అండగా కేసిఆర్ ప్రభుత్వం ప్రారంభించిన ఈ పథకాన్ని 2023 డిసెంబర్ నుండి ప్రభుత్వం నిలిపివేసిందన్నారు. హై కోర్టు లో కౌంటర్ దాఖలు చేయకపోవడంతో కోర్టు పథకాల నిలిపివేతకు ఆదేశించిందని, వెంటనే ఉత్తర్వులు జారీ చేసి పథకాన్ని కొనసాగించాలని కోరారు. కేసిఆర్ హయాంలో వృద్ధాప్య పెన్షన్ రూ.200 నుండి రూ.2000కు, వికలాంగులకు రూ. 500ల నుండి రూ.4వేలకు పెంచామని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీ మేరకు అందరికీ రూ.4000, మహిళలకు రూ.2500 పెన్షన్ ఆగస్టు 15 నుండి అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీడీ కార్మికులకు ప్రావిడెంట్ ఫండ్ చెల్లించాలన్న హామీని కూడా నెరవేర్చాలని, ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరించి పేదలు, మహిళలు, వృద్ధులకు అన్యాయం చేయవద్దన్నారు. వయో వృద్ధుల చట్టాన్ని తీసుకవచ్చిన ప్రభుత్వమే ఉల్లంఘిస్తుందన్నారు. సంక్షేమ పథకాల అమలును సీఎం రేవంత్ రెడ్డి నిర్వీర్యం చేస్తున్నారని, ప్రభుత్వానికి ఆడబిడ్డల-మిగతా 2లో

### ధర్మపురి క్షేత్రం అభివృద్ధితో

## మారనున్న రూపురేఖలు

- కుంభమేళా తరహాలో పుష్కరాలు
- రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



**చురకలు విలేకరి, ధర్మపురి, ఆగస్టు 13:** ఎన్నికల సందర్భంగా ఇచ్చిన మాట ప్రకారం ధర్మపురి క్షేత్ర అభివృద్ధికి కట్టుబడి ఉన్నా మని, అభివృద్ధి కార్యక్రమాలతో ధర్మపురి రూపురేఖలు మారనున్నట్లు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. గురువారం జగిత్యాల జిల్లా ధర్మపురిలో అంబేద్కర్ భవన నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ధర్మపురి పట్టణం లోని వివిధ కుల సంఘాల భవనాల నిర్మాణాలకు నిధులు కేటాయించినట్లు, ధర్మపు రిలో భవిష్యత్ తరాలకు ఉపయోగపడే విధంగా అంబేద్కర్ భవన నిర్మాణం చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగా గ్రౌండ్ ఫ్లోర్లో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం,మరో రెండు అంతస్తులు విద్యార్థుల చదువు కావలసిన ఏర్పాట్లు చేస్తామన్నారు.

**కుంభమేళా తరహాలో గోదావరి పుష్కరాలు...**

గోదావరి పుష్కరాలను కుంభమేళ తరహాలో నిర్వహిస్తాం.-మిగతా 2లో

## కోటిలింగాల ఆలయ మాజీ చైర్మన్, వ్యాపారి రేగొండ వైకుంఠం మృతి



**చురకలు విలేఖరి, వెల్గటూర్, ఆగస్ట్ 13 :** జగిత్యాల జిల్లా మండల కేంద్రం వెల్గటూర్ కు చెందిన వ్యాపారి, మాజీ కోటిలింగాల ఆలయ చైర్మన్ రేగొండ వైకుంఠం అనారోగ్యంతో హైదరాబాద్ ఆసుపత్రిలో చికిత్సపొందుతూ గురువారం సాయంత్రం మరణించినట్లు కుటుంబీకులు తెలిపారు. వెల్గటూర్ లో వ్యాపారం చేసుకుంటూ,ఆధ్యాత్మిక చింతనతో కోటిలింగాల శ్రీ పార్వతి కోటేశ్వరస్వామి ఆలయ పునరుద్దరణ కోసం కృషిచేశారు.అనంతరం ఆలయం ఎండోమెంట్ పరిధిలోకి చేరగా ఆలయ చైర్మన్ గా ఎన్నికై ఆలయ అభివృద్ధికి పాటుపడ్డారు. ప్రస్తుతం వృద్దాప్యంతో ఇంటికే పరిమితమైన ఆయన ఇంట్లో జారిపడి అశ్వస్థతకు గురై ఆసుపత్రిలోచేరి చికిత్స పొందుతూ మరణించారు. ఈయన మృతిపట్ల స్థానిక ప్రజాప్రతి నిధులు,నాయకులు, గ్రామ ప్రముఖులు తమ ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు.

## వర్షపు నీటిని సంరక్షించి భూగర్భ జలాలను పెంచాలి



**చురకలు ప్రతినిధి, కోరుట్ల ఆగస్టు 13 :** వర్షపు నీటిని వృథా చేయకుండా సంరక్షించడం ద్వారా భూగర్భ జలాలను పెంపొందించుకోవచ్చని కోరుట్ల మున్సిపల్ కమిషనర్ రాఘవేంద్ర అన్నారు. గురువారం పట్టణంలోని ఆరెకటిక సంఘ భవనం వద్ద ఇంకుడు గుంత నిర్మాణ పనులను కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. వర్షపు నీటిని భూగర్భంలోకి ఇంకేలా ప్రతి ఒక్కరూ చర్యలు చేపట్టాలని సూచించారు. కమ్యూనిటీ హాళ్లు, కళాశాలలు, ప్రభుత్వ భవనాలతో పాటు ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలను నిర్మించుకోవాలని కోరారు. భవిష్యత్‌లో నీటి సమస్యలు తలెత్తకుండా వర్షపు నీటి సంరక్షణపై ప్రజల్లో అవగాహన పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ఆరెకటిక సంఘం ఆధ్వర్యంలో ఇంకుడు గుంత నిర్మాణానికి చొరవ చూపిన సంఘ నాయకులను కమిషనర్ రాఘవేంద్ర అభినందించారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు రాజ్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు గోడికె అశోక్, శ్రీనివాస్, నాగరాజు, గాంధీ, నరేష్, మహేందర్, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

## ధర్మపురి క్షేత్రం అభివృద్ధితో....

గోదావరి పుష్కరాలకు ప్రభుత్వం రూ.117 కోట్లు కేటాయించగా ఇందులో ధర్మపురిలో రూ. 37 కోట్లతో అభివృద్ధి పనులు చేస్తున్నానమన్నారు. లక్షలాదిగా తరలివచే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పూర్తి స్థాయిలో ఏర్పాటు చేస్తాము. టి యు ఎఫ్ ఐ డి సి నిధులు రూ. 15 కోట్లతో పాటు అమృత పథకం ద్వారా నిధులు సాధించి ధర్మపురి లో అభివృద్ధి పనులు కొనసాగిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ వేముల నాగలక్ష్మి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ సంఘనబట్ల దినేష్,మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ చిలుముల లావణ్య, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చిలుముల లక్ష్మణ్, ఉపాధ్యక్షుడు వేముల రాజేష్,ఆలయ మాజీ చైర్మన్ జక్కు రవీందర్, మున్సిపల్ కౌన్సిలర్ లు ఒజ్జల లక్ష్మణ్, చిపిరిశెట్టి రాజేష్,విజయ్ బాబు,సంగి ఆనంద్,చుక్క సంధ్య,జింజరికాని సువర్ణ, విరవేణి నాగలక్ష్మి, నాయకులు కార్యకర్తలు, దళిత సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాల....

పట్ల చిన్నచూపు ఎందుకని ప్రశ్నించారు. గతంలో కేసీఆర్ అమలు చేసిన పథకాలకు తోడుగా కొత్తవి అమలు చేయకున్నా పాతవి అమలు చేయాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ జీనత్ పర్వీన్ మున్నా, నాయకులు వొల్లెం మల్లేశం, శీలం ప్రవీణ్, గాజుల రాజేందర్, కల్లెపల్లి దుర్గయ్య, కోరుకంటి రాము, బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర దినోత్సవ వేడుకలు

ఆమె సూచించారు. ప్రభుత్వ గౌరవాన్ని నిలబెట్టేలా అన్ని ఏర్పాట్లు నాణ్యతతో చేయాలని అన్నారు. జిల్లా ప్రజలంతా స్వాతంత్ర దినోత్సవ దినోత్సవాన్ని గౌరవంగా, దేశభక్తి వాతావరణంలో జరుపుకోవాలని ఆహ్వానించారు. ఈ పరిశీలనలో అదనపు కలెక్టర్లు బిఎస్.లత, బి. రాజ గౌడ్, డిఆర్డిఏ రఘువరన్, డిపిఆర్వో శ్రీధర్, సంబంధిత జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏ.వో కిషన్, ఎమ్మార్వో రామ్మోహన్, రెవిన్యూ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది, డిఆర్డిఏ సిబ్బంది, పోలీస్ శాఖ సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# పోలీసుల పేరుతో సైబర్ మోసాలు - అంతర్ జిల్లా నిందితుల అరెస్ట్



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట ఆగస్టు 13 :** పోలీసుల పేరుతో అమాయక ప్రజలను మోసం చేస్తున్న ఇద్దరు అంతర్ జిల్లా సైబర్ నిందితుల ను చందుర్తి పోలీసులు అరెస్ట్ చేసినట్లు వేములవాడ డీఎస్పీ శ్రీనివాసులు వెల్లడించారు. నిందితుల నుంచి మొబైల్ ఫోన్లు, సిమ్ కార్డులు, రూ.18 వేల నగదు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. అరెస్టయిన వారు నల్గొండ జిల్లా మోతే మండలాని కి చెందిన ప్రస్తుతం హైదరాబాద్ అల్మాస్‌గూడలో నివాసం ఉంటున్న కిలుకాని సాయిచంద్ (30), సూర్యాపేట జిల్లాకు చెందిన ప్రస్తుతం హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న కట్కూరి శరత్‌కుమార్ (31).డీఎస్పీ వివరాల ప్రకారం, నిందితులు గూగుల్, టెలిగ్రామ్ ద్వారా మీసేవ కేంద్రాలు, మనీ ట్రాన్స్‌ఫర్ సెంటర్ల ఫోన్ నంబర్లను సేకరించేవారు.అనంతరం బాధితులకు ఫోన్ చేసి,తాము ASI శ్రీనివాస్ రెడ్డి అనే పోలీస్ అధికారుల మని పరిచయం చేసుకుని, హాస్పిటల్ ఖర్చుల కోసం అత్యవసరంగా డబ్బులు అవసరమని నమ్మించేవారు. మోసానికి ప్రత్యేక పద్ధతి అనుసరించిన నిందితులు ముందుగా పెట్రోల్ బంక్ సిబ్బందిని సంప్రదించి, తమ వాహనం లేదా బోర్ బండి రిపేర్‌కు వచ్చిందని, తమ సర్‌డబ్బులు వారి ఫోన్ నంబర్‌కు పంపిస్తారని చెప్పి ఆ నంబర్‌ను తీసుకునేవారు. ఆ తర్వాత అదే నంబర్‌ను మీసేవ నిర్వాహకులకు ఇచ్చి, బాధితుల నుంచి ఆన్‌లైన్‌లో డబ్బులు బదిలీ చేయించేవారు. డబ్బులు జమ అయిన తరువాత పెట్రోల్ బంక్ వద్దకు వెళ్లి నగదును తీసుకునేవారని పోలీసులు తెలిపారు.ఈ క్రమంలో చందుర్తి మండలానికి చెందిన చిలుక పెంటయ్యకు ఫోన్ చేసిన నిందితులు, చందుర్తి పోలీస్ స్టేషన్ నుంచి మాట్లాడుతున్నామని చెప్పారు. తమ బాబు హైదరాబాద్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని, అత్యవసరంగా రూ.70 వేల అవసరమని చెప్పి నమ్మించారు. నిందితులు ఇచ్చిన ఫోన్ నంబర్‌కు పెంటయ్య రూ.70 వేలును ఆన్‌లైన్‌లో బదిలీ చేశాడు. అనంతరం నిందితులు ఫోన్లు స్విచ్ ఆఫ్ చేయడం తో మోసపోయినట్లు గ్రహించిన పెంటయ్య చందుర్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, జిల్లా ఎస్పీ ఆదేశాలపై సీఐ రవీందర్, ఎస్ఐ రమేష్, సైబర్ క్రైమ్ ఆర్ఎస్ఐ జునైద్తో పాటు ప్రత్యేక బృందం దర్యాప్తు చేపట్టింది. సాంకేతిక ఆధారాల సహాయంతో నిందితులను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో నిందితులు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో 28కుపైగా కేసుల్లో ప్రమేయం ఉన్నట్లు తెలిసింది. బాధితుల నుంచి సుమారు రూ.15లక్షల వరకు మోసాలు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. చాకచక్యంగా వ్యవహరించి నిందితులను అరెస్ట్ చేసిన సీఐ రవీందర్, ఎస్ఐ రమేష్,ఆర్ఎస్ఐ జునైద్,సిబ్బంది అనిల్ ,గంగారెడ్డిలను డీఎస్పీ శ్రీనివాసులు ప్రత్యేకంగా అభినందించారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికీ నూతన పెన్షన్లు అందిస్తాం

**మొదటి పేజీ తరువాయి..**నూతన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తోందని మంత్రి తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, నూతన రేషన్ కార్డులు, సన్న బియ్యం పంపిణీ, ఇందిరమ్మ ఇళ్ల పథకం, పేద కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ వంటి సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు.ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేదలకు ఇళ్లు నిర్మించుకు నేందుకు ప్రతి లబ్ధిదారునికి రూ.5 లక్షలు అందిస్తున్నట్లు మంత్రి తెలిపారు. పేదల సంక్షేమం, సామాజిక భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రాష్ట్రంలోని యువతకు నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో సుమారు రూ.200 కోట్ల వ్యయంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ధర్మపురి నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు శంకుస్థాపన జరిగిందని, ప్రస్తుతం పనులు కొనసాగుతున్నాయన్నారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన విద్యార్థులు ఒకే చోట నాణ్యమైన విద్యను అభ్యసించేలా సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రతి పేద విద్యార్థికి అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్య అందించాలనే లక్ష్యంతో ఈ పాఠశాలలను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. గురుకులాలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న సుమారు రూ.1,000 కోట్ల బిల్లులను ప్రభుత్వం క్లియర్ చేసిందని మంత్రి తెలిపారు. సంక్షేమ హాస్టళ్లకు సంబంధించిన బిల్లులను ప్రతి నెలా గ్రీన్ ఛానల్ ద్వారా చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంద న్నారు. సాగునీటి అంశంపై ముఖ్య మంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఇటీవల సమీక్ష నిర్వహించారని మంత్రి తెలిపారు. రైతు లకు అవసరమైన మేరకు సాగునీరు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటు ందని, రాష్ట్రంలో సాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బం దులు లేకుండా చర్యలు చేపడతామని తెలిపారు. వెలమ కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడి నరసింగ రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంగనబట్ల దినేష్, అదనపు కలెక్టర్ బి.రాజ గౌడ్, డిఆర్డిఓ పాల్గొన్నారు.

# ఆకట్టుకున్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ నాటిక ప్రదర్శన



**చురకలు ప్రతినిధి, కమాన్ పూర్ ఆగస్టు 13 :** రామగిరి మండలం సెంటినరీ కాలనీ రామగుండం-3, అడ్రి యాల ప్రాజెక్ట్ ఏరియా లోని స్థానిక రా ణి రుద్రమదేవి క్రీడా ప్రాంగణం నందు గల సి.ఇ.ఆర్. క్లబ్ లో గురువారం సింగరేణి కాలరీస్ కంపెనీ, అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ, హైద్రాబాద్ వారి ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గారి జీవిత చరిత్ర, ఆశయాలు, రాజ్యాంగ విలువలు, సామాజిక సమానత్వం, సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన కృషిని ప్రతిబింబించేలా " సంఘం శరణం గచ్ఛామి" ప్రత్యేక నాటిక ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించి, నాటిక ప్రదర్శనను ప్రారంభిం చారు.అనంతరం నాటికను వీక్షించిన జీ ఎం మాట్లాడుతూ, డాక్టర్ బి.ఆర్. అంబే ద్కర్ గారి జీవితం, ఆయన ఆశయాలు, సమాజానికి అందించిన సేవలు, సమానత్వం మరియు సామాజిక న్యాయం కోసం చేసిన పోరాటాన్ని నాటిక రూపంలో కళాకారులు ఎంతో చక్కగా ప్రదర్శించారని అభినందించారు. ఇటువంటి సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా అంబేద్కర్ ఆలోచనలు, రాజ్యాంగ విలువలు, సామాజిక బాధ్యతలపై ప్రజల్లో మరింత అవగాహన పెంపొందుతుందని పేర్కొన్నారు.నాటికలో అంబేద్కర్ బాల్యం నుంచి ఆయన విద్యాభ్యాసం, ఎదుర్కొన్న సామాజిక వివక్ష, విద్య ద్వారా సాధించిన ఉన్నత స్థానం, అణగారిన వర్గాల హక్కుల కోసం చేసిన పోరాటం, భారత రాజ్యాంగ రూపకల్పనలో ఆయన పోషించిన కీలక పాత్ర వంటి అంశాలను కళాకారులు భావోద్వేగభరితంగా ప్రదర్శించారు. నాటిక ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకోవడంతో పాటు, సామాజిక సమానత్వం, రాజ్యాంగ స్ఫూర్తి పట్ల ఆలోచింపజేసింది.సింగరేణి సంస్థలో ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, ప్రజల్లో కళా, సాంస్కృతిక కార్యక్రమాల పట్ల ఆసక్తిని పెంపొందించేందుకు ఇటువంటి నాటికలు, సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. అంబేద్కర్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో నాటిక వంటి కళారూపాలు ప్రభావవంతమైన మాధ్యమాలుగా నిలుస్తాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గుర్తింపు , ప్రాతినిధ్య సంఘాల నాయకులు యం. రామచంద్ర రెడ్డి, కోట రవీందర్ రెడ్డి, అధికారుల సంఘం ప్రతినిధి శ్రీకాంత్, ఎస్వోటు జిఎం బండి సత్య నారాయణ, పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, ఎస్.సి, ఎస్.టి అసోసియేషన్ సభ్యులు బత్తుల శంకర్, ఆకునూరి బాల అంకూస్, కిషన్ నాయక్, సేవా సభ్యులు, అభ్యుదయ నిర్వాహకులు జగ్గారాజు తో పలువురు అధికారులు, ఉద్యోగులు, కార్మికులు, కుటుంబ సభ్యులు, కళాభిమానులు పాల్గొని నాటికను ఆసక్తిగా వీక్షించారు.

## జగిత్యాలలో ఘనంగా తిరంగా ర్యాలీ



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఆగస్టు 13 :** భారత స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జగిత్యాలలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. భారతీయ జనతా పార్టీ జగిత్యాల జిల్లా ఆధ్వర్యంలో గురువారం టౌన్‌హాల్ నుంచి పాత బస్టాండ్ వరకు తిరంగా ర్యాలీ నిర్వహించారు. పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు జాతీయ జెండాలను చేతబూని ర్యాలీలో పాల్గొన్నారు. భారత్ మాతాకీ జై నినాదాలతో పట్టణంలోని పురవీధులు మార్మోగాయి.దేశభక్తి గీతాల నడుమ ర్యాలీ ఉత్సాహ భరితంగా సాగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా మాట్లాడుతూ ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం ఎగరాలని, ఇదే ప్రధాని మోదీ ఆకాంక్ష అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను యువత స్మరించుకోవాలని పిలుపునిచ్చారు. దేశభక్తిని భావితరాలకు అందించడమే హర్ ఘర్ తిరంగా లక్ష్యమని తెలిపారు. జాతీయ జెండా గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ ఇంచార్జి డా.భోగ శ్రావణి, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పాఠశాలకు సీసీటీవీ కెమెరాలు, సౌండ్ సిస్టం అందజేత



**చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం ఆగస్టు (13)** : జగిత్యాల జిల్లా ఇబ్రహింపట్నం మండలంలోని మూలరాంపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి గ్రామ సర్పంచ్ కానుగంటి లాస్యప్రియ సహకారం అందించారు. ఈమేరకు గురువారం విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని పాఠశాలకు సీసీటీవీ కెమెరాలు,పాఠశాల కార్యక్రమాల నిర్వహణ కోసం సౌండ్ సిస్టంను అందజేశారు.సీసీటీవీ కెమెరాల ఏర్పాటు ద్వారా విద్యార్థుల భద్రత మరింత మెరుగుపడటంతో పాటు పాఠశాల పరిసరాలపై నిరంతర పర్యవేక్షణ సాధ్యమవుతుందని పేర్కొన్నారు.అలాగే సౌండ్ సిస్టం ద్వారా ప్రార్థనా కార్యక్రమాలు, సమావేశాలు,విద్యా,సాంస్కృతికకార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించేందుకు ఉపయోగపడుతుందని తెలిపారు.పాఠశాల మౌలిక వసతుల అభివృద్ధి, విద్యార్థుల సంక్షేమం కోసం గ్రామ పంచాయతీ అందిస్తున్న సహకారం అభినందనీయమని ఉపాధ్యాయులు అన్నారు. భవిష్యత్తులో కూడా పాఠశాల అభివృద్ధికి గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు ఇదే విధంగా సహకరించాలన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రవీణ్ కుమార్, ఉపాధ్యాయులు విద్య, దివ్య సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కానుగంటి లాస్యప్రియ ,నాయకులు కానుగంటి రాజశేఖర్, ప్రధానోపాధ్యాయులు ప్రవీణ్ కుమార్, ఉపాధ్యాయులు మరియు పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పిఆర్సిని వెంటనే ప్రకటించాలి

**చురకలు విలేకరి, కొడిమ్యాల, ఆగస్టు 13 :** రాష్ట్ర ప్రభుత్వం పిఆర్సిని వెంటనే ప్రకటించాలని జిల్లా పిఆర్టియూ టిఎస్ అధ్యక్షుడు బోయినిపల్లి ఆనంద్ రావు అన్నారు. గురువారం కొడిమ్యాల మండలంలో బోయినిపల్లి ఆనంద్రావు ఆధ్వర్యంలో కొడిమ్యాల మండలంలోని వివిధ పాఠశాలల్లో పీఆర్టీయూ-టీఎస్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనంద్రావు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణమే పీఆర్సీని ప్రకటించాలని కోరారు.పీఆర్సీ అమలులో జాప్యం కారణంగా ఉద్యోగులు, ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల హక్కుల సాధన కోసం సంఘం ఆధ్వర్యంలో చేపట్టే కార్యక్రమాలకు అందరూ ఐక్యంగా మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 1న హైదరాబాద్ లో నిర్వహించనున్న మహాధర్నాను వి జయవంతం చేసేందుకు పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు తరలివచ్చి పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొడిమ్యాల మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్, అంజయ్య, రాష్ట్ర అసోసియేట్ నాయకులు రాజమల్లయ్య, కార్యవర్గ సభ్యులు సదయ్య, రాజేశం తదితరులు పాల్గొన్నారు.

# విద్యా రంగ అభివృద్ధికి ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి

### -జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్



**చురకలు విలేకరి, రాయికల్, ఆగస్టు 13 :** తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపుతో పాటు మౌలిక సదుపాయాల అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు.గురువారం రాయికల్ మండలంలోని అల్లిపూర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో 3.50 లక్షలతో ప్రహరీ గోడ,5లక్షలతో కిచెన్ షెడ్ నిర్మాణం,4 లక్షలతో మరుగు దొడ్లు,6లక్షలతో సీసీ రోడ్డు,4 లక్షలతో అంగన్వాడి భవన మరమ్మత్తు పనులు మొత్తం 22.5 లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపన,రాయికల్ పట్టణంలో గుడి రెడ్డి సంఘంలో 57మంది లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన 18 లక్షల 60 వేల రూపాయల విలువ గల చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే పంపిణీచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు ఆధునిక వసతులతో కూడిన పాఠశాలలను తీర్చిదిద్దేదిశగా ప్రభుత్వం పలుచర్యలు చేపడుతుందన్నారు.ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, నాణ్యమైన ఆహారం, ఆధునిక విద్యా విధానం, డిజిటల్ సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తుందన్నారు. పాఠశాలలు దేశ భవిష్యత్తును నిర్మించే వేదికలుగా నిలవాలన్న లక్ష్యంతో విద్యా రంగాన్ని ప్రభుత్వం మరింత బలోపేతం చేస్తున్నట్లు తెలిపారు.విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతో పాటు అల్పాహారం కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిందన్నారు.200 కోట్ల తో ఇంటిగ్రేటెడ్ స్కూల్ కాంప్లెక్ నిర్మాణ పనులు జరుగుతున్నాయని ఇందులో 2500 మంది విద్యార్థులకు విద్య బోధన జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎంబారి గౌతమి వెంకటేష్,ఆత్మ చైర్మెన్ కాటిపెల్లి గంగారెడ్డి,పాక్స్ చైర్మెన్‌లు రాజలింగం, ఏనుగు మల్లారెడ్డి, కౌన్సిలర్ పల్లికొండ గంగాధర్,మున్సిపల్ కమిషనర్ మనోహర్,తహసిల్దార్ నాగర్జున,మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రవీందర్ రావు, పట్టణ అధ్యక్షులు వాసం రాజేందర్, సర్పంచులు బోదాసు చంద్రశేఖర్, ప్రసాద్, శ్రీనివాస్,మాజీ మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు, మాజీ సర్పంచ్ తంగేళ్ల రమేష్, నాయకులు ముఖీద్,సురేందర్, జోగిని పెల్లి తిరుపతి,మరి పెల్లి శ్రీనివాస్, సామల్ల వేణు తదితరులు పాల్గొన్నారు.

# సింగిల్ విండో చైర్మన్ పదవుల్లో యాదవులకు ప్రాధాన్యత కల్పించాలి

### -అఖిలభారత యాదవ మహాసభ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు పలుమారు మల్లేష్ యాదవ్



**చురకలు విలేకరి ఎండపల్లి ఆగస్టు 13 :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పరపతి (సింగిల్ విండో) చైర్మన్ పదవులను నామినేటెడ్ పద్ధతిలో భర్తీ చేయనున్న క్రమంలో జనాభా దామాషా ప్రకారం గా యాదవులకు అత్యంత ప్రాధాన్యత కల్పించాలని అఖిల భారత యాదవ మహాసభ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు పలుమారు మల్లేష్ యాదవ్ డిమాండ్ చేశారు. ఎండపల్లి మండలం రాజారాం పల్లి లో పాత్రికేయ సమావేశంలో మల్లేష్ యాదవ్ మాట్లాడుతూ గత సార్వత్రిక ఎన్నికల్లో యాదవులు అధిక సంఖ్యలో కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలిపి, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి తీవ్రంగా కష్టపడి పనిచేసిన కార్యకర్తలు యాదవుల్లో ఉన్నారని వారిని గుర్తించి యాదవ సామాజిక వర్గానికి చెందిన అలాంటి కార్యకర్తలకు చైర్మన్ పదవులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఎలుక భగవాన్ యాదవ్ మాట్లాడుతూ ధర్మపురి నియోజకవర్గంలో అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గెలుపు కోసం ఉమ్మడి వెల్గటూర్ మండలంలోని మెజార్టీ యాదవులంతా మద్దతు తెలిపారని, ఆయన గెలుపు కోసం కృషి చేసిన యాదవ సామాజిక వర్గానికి చెందిన కార్యకర్తను గుర్తించి ఎండపల్లి సింగిల్ విండో చైర్మన్ పదవి కేటాయించాలని కోరారు. అలాగే ధర్మపురి నియోజకవర్గంలోని నంది మేడారం, జైనా, చందోలి, నంచర్ల సింగిల్ విండో చైర్మన్ పదవులు సైతం యాదవులకే కేటాయించాలని మంత్రి లక్ష్మణ్ కుమార్ ను కోరారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత యాదవ మహాసభ ఎండపల్లి మండల శాఖ అధ్యక్షుడు అల్లె వెంకటేష్ యాదవ్, వెల్గటూర్ మండల శాఖ అధ్యక్షుడు మాచర్ల రాజేందర్ యాదవ్, నాయకులు బైకని రవీందర్ యాదవ్,జల్లెల్ల కనుకయ్య యాదవ్,జక్కుల రవి కుమార్ ,సమ్మెట బాపు రాజు,మాచర్ల రమేష్, బూస మహేందర్,ఏదుల మణిదీప్,నక్క మహేష్ తదితరులు పాల్గొన్నారు.

### జవాద్ మృతదేహాన్ని స్వదేశానికి తరలించేందుకు

# తెలంగాణ రక్షణ సేన చొరవ



**చురకలు ప్రతినిధి కోరుట్ల ఆగస్టు 13 :** జగిత్యాల జిల్లా ఇస్లాంపూర్‌కు చెందిన మహమ్మద్ అబ్దుల్ జవాద్ మాల్టాలో మృతి చెందడంతో ఆయన మృతదేహాన్ని స్వదేశానికి తరలించేందుకు తెలంగాణ రక్షణ సేన నాయకులు ప్రత్యేక చొరవ తీసుకున్నారు. కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న నేపథ్యంలో ప్రభుత్వ సహాయం అందించి మృతదేహాన్ని త్వరగా భారత్‌కు తరలించాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.ఈ విషయం తెలుసుకున్న కోరుట్ల నియోజకవర్గ తెలంగాణ రక్షణ సేన సీనియర్ నాయకుడు అజర్ భాయ్ ఆధ్వర్యంలో గురువారం కుటుంబ సభ్యులకు అండగా నిలిచే ప్రయత్నాలు ప్రారంభించారు.కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ రఘు జవాద్ కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడి వారి పరిస్థితిని తెలుసుకున్నారు.కుటుంబానికి ధైర్యం కల్పిస్తూ మృతదేహాన్ని స్వదేశానికి తీసుకురావడానికి అవసరమైన చర్యలపై చర్చించారు. అనంతరం జవాద్ మృతదేహాన్ని వీలైనంత త్వరగా స్వదేశానికి తరలించే అంశాన్ని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత దృష్టికి తీసుకెళ్లినట్లు నాయకులు తెలిపారు. సంబంధిత అధికారులతో సమన్వయం చేస్తూ కుటుంబానికి అవసరమైన సహాయం అందేలా ప్రయత్నాలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. మాల్టాలో విషాదం ఇస్లాంపూర్‌కు చెందిన మహమ్మద్ అబ్దుల్ జవాద్ మాల్టాలో ఉద్యోగం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అయితే ఆగస్టు 11న మాల్టాలో ఆయన మృతి చెందడంతో కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. మృతదేహాన్ని స్వదేశానికి తీసుకురావడానికి అయ్యే ఖర్చులను భరించే పరిస్థితి కుటుంబానికి లేకపోవడంతో ప్రభుత్వ సహాయం కోసం విజ్ఞప్తి చేశారు. కుటుంబానికి అండగా తెలంగాణ రక్షణ సేన విదేశాల్లో మృతి చెందిన జవాద్ మృతదేహాన్ని స్వదేశానికి తీసుకురావడంలో కుటుంబానికి అండగా నిలవడం తమ బాధ్యతగా భావిస్తున్నామని అజర్ భాయ్, డాక్టర్ రఘు తెలిపారు. అవసరమైన ప్రభుత్వ సహకారం అందేలా అన్ని స్థాయిల్లో కృషి చేస్తామని పేర్కొన్నారు. జవాద్ మృతదేహాన్ని వీలైనంత త్వరగా స్వదేశానికి తీసుకువచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరారు.తమ కుటుంబ సభ్యుడిని చివరిసారిగా స్వగ్రామంలో చూసుకుని అంత్యక్రియలు నిర్వహించాలన్న జవాద్ కుటుంబం ఆకాంక్ష నెరవేరేలా సహకరించాలని సంబంధిత అధికారులకు విజ్ఞప్తి చేశారు.



## ఎస్ఐ శ్యామ్ రాజ్‌కు ఎంఐఎం నాయకుల ఘన సన్మానం



**చురకలు ప్రతినిధి కోరుట్ల, ఆగస్టు 13 :** కోరుట్ల పట్టణానికి నూతనంగా ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన శ్యామ్ రాజ్‌ను ఎంఐఎం పార్టీ కోరుట్ల పట్టణ శాఖ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సన్మానించారు. పట్టణ అధ్యక్షుడు ఎం.ఏ. రఫీ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు ఎస్సై శ్యామ్ రాజ్‌కు శాలువా కప్పి ఘన స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎం.ఏ. రఫీ మాట్లాడుతూ గతంలో కోరుట్ల పట్టణంలో ఎస్సైగా సేవలందించిన శ్యామ్ రాజ్‌ను తిరిగి కోరుట్లకు బదిలీ చేయడం సంతోషకరమన్నారు. గతంలో ఆయన ప్రజలకు అందించిన సేవలు అభినందనీయమని, భవిష్యత్తులో కూడా ప్రజలకు మరిన్ని మెరుగైన సేవలు అందిస్తారని ఆకాంక్షించారు.పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖకు ఎంఐఎం పార్టీ తరపున తమ సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని రఫీ తెలిపారు. ప్రజలు తమ సమస్యలు లేదా ఆపద సమయంలో పోలీసులను సంప్రదించినప్పుడు అధికారులు సత్వర స్పందనతో సేవలందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎం పార్టీ కోరుట్ల శాఖ కార్యదర్శి అబ్దుల్ వాజీద్, అబ్దుల్ రహీం, కె. సురేష్, సహాయ కార్యదర్శులు, ముజాహిద్ ఖాన్ (కోశాధికారి), మహమ్మద్ ఫయాజ్, మహమ్మద్ సల్మాన్, మహమ్మద్ నాహిద్, మహమ్మద్ అర్మాన్, మహమ్మద్ సమీర్, అబ్దుల్ హమీద్, సుహేల్, శహబాజ్, ఇర్ఫాన్, సలీం, సద్దాం తదితరులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తు చర్యలు



**చురకలు విలేకరి,మెట్‌పల్లి రూరల్, ఆగస్టు 13 :** మండలంలోని ఆత్మకూర్ గ్రామపంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో గురువారం వర్షాకాల దృశ్య సీజనల్ వ్యాధులు రాకుండా మురికి కాలువల వెంబడి గడ్డి మందుతో పాటు దోమల మందు స్ప్రేయింగ్ జరిపారు.గ్రామంలోని ప్రజలు తమ ఇంటి పరిసరాల వద్ద మురికి నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని పబ్లిక్ స్థలంలో ఉన్న హోటల్ వారికీ సీజనాల్ వ్యాధులు రాకుండా ఉండటానికి తోసుకోవాల్సిన జాగ్రత్తలాపై ప్రత్యేక సూచనలు తెలియజేసారు.అనంతరం ప్రభుత్వ పాఠశాలలో చదువుతు 14ఏళ్లు నిండిన ఆడపిల్లలకు గర్భశాయ ముఖద్వారా క్యాన్సర్ రాకుండా హెచ్పివి వ్యాక్సిన్ హెల్త్ సబ్ సెంటర్ లో వేయించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ చిట్యాల రాజారాం,ఉప సర్పంచ్ కసడి తిరుపతి, డా.కృష్ణవేణి, వంసంత, ఆశలు లక్ష్మి, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రముఖులకు జయంతి ఉత్సవాల ఆహ్వాన పత్రం అందజేత



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ ఆగస్టు 13 :** కమాన్‌పూర్ మండల కేంద్రంలోని శ్రీ ఆది వరహస్వామి జయంతి ఉత్సవాలకు పెద్దపల్లి డిసిపి బి రామ్ రెడ్డి, పెద్దపల్లి అదనపు కలెక్టర్,సింగరేణి సంస్థ ఆర్ జి వన్ జిఎం లలిత్ కుమార్ లకు ఆహ్వాన పత్రాలను అందజేశారు.ఈనెల 23 నుండి 26వ తేదీ వరకు స్వామివారి జయంతిఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు.ఆహ్వాన పత్రాలు అందజేసిన వారిలో ఆలయ చైర్మన్ ముస్త్యాల దామోదర్, ఆలయ ఈవో కాంతారెడ్డి, ప్రధాన అర్చకులు కలకుంట్ల వరప్రసాదాచార్యులు, డైరెక్టర్లు తీగల రాజయ్య, కొంతం శ్రీనివాస్, అనవేల శ్యామల సదయ్య, చాట్ల రాయమల్లు తదితరులు ఉన్నారు.

### శని,ఆది రెండురోజులు

# నియోజకవర్గ ప్రజలకు అందుబాటులోఉంటా

- -చివరి ఆయకట్టువరకు సాగునీటిశాశ్వతపరిష్కారం
- -స్థానిక ప్రజాసమస్యల పరిష్కారంలో అధికారులు అలసత్వం వీడాలి
- -సీఎం సహాయనిది పేదల ఆరోగ్యానికి భరోసా
- -రాష్ట్ర సాంఘీక సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మన్ కుమార్



**చురకలు, విలేఖరి, వెల్గటూర్, ఆగస్ట్ 13 :** ధర్మపురి నియోజకవర్గం లోని వెల్గటూర్ మండలంతో పాటు ఎండపల్లి, ధర్మారం,తదితర మండలాల రైతుల చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకొంటున్నట్లు రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరిలక్ష్మన్ కుమార్ స్పష్టం చేశారు.గురువారం వెల్గటూర్ మండల పరిషత్ కార్యాల యంలో ముఖ్యమంత్రి సహాయనిది లబ్ధి దారులకు చెక్కుల పంపిణి కార్యక్రమం లో మంత్రి పాల్గొని మాట్లాడారు. గోదావరి పక్కనే ఉన్నా ఈ ప్రాంత రైతాంగానికి సాగునీటి కష్టాలుతప్పడం లేదని,ఇక్కడి గోదావరి ఎల్లంపల్లి ప్రాజెక్టు ద్వారా దూర ప్రాంతాలకు సాగు,తాగు నీరు తరలిస్తూ ఈ ప్రాంత రైతుల భూములకు చుక్క నీరుఅందడం లేదన్న విషయాన్ని ఇటీవల జరిగిన నీటి పారుదల శాఖ సమీక్ష సమావేశంలో సీఎం, రేవంత్ రెడ్డి సంబంధిత నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిల దృష్టికి తీసుకెళ్ళినట్లు మంత్రి తెలిపారు.ధర్మపురి నియోజకవర్గ వివిధ మండలాల రైతాంగానికి సంబంధించి చివరి ఆయకట్టు భూములన్నిటికీశాశ్వత సాగు నీటి కష్టాలు తీర్చేందుకు తగు చర్యలు తీకొంటున్నట్లు,రంగదాముని పల్లె రిజర్వాయర్,పత్తిపాకరిజర్వా యర్, జగదేవుపేట జంగల్ నాల్ ప్రాజెక్టులను పునరుద్దరించిసాగునీటి శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టను న్నట్లు మంత్రిఅడ్లూరి పేర్కొన్నారు. నియోజకవర్గానికి చెందిన ప్రజలు చిన్న చిన్న పనులకోసం వ్యయ, ప్రయాసాల కోర్చి హైదరాబాద్ వరకు తనకోసం రావలసిన అవసరం లేదని ప్రతి శని,ఆది వారాలు రెండు రోజులపాటు ధర్మపురిక్యాంపుకార్యాలయంలో అందుబాటులోఉంటానని సమస్యల కోసం అక్కడే తనను కలవాలని మంత్రి ప్రజలకు స్పష్టం చేశారు.ప్రజలు పలుసమస్యలకోసం స్థానిక మండల కార్యాలయాలకు వస్తే అధికారులు తమపరిధిలోని సమస్యలనువెంటనే పరిష్కరించాలని,ప్రజలను ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిప్పుకోవద్దని, తమపరిధిలో లేని సమస్యలు తనదృష్టికి తీసుకు రావాలనిఅధికారులకు సూచించారు. తనను గెలిపించి మంత్రిహోదా కల్పించిన నియోజక ప్రజలకు విధేయుడిగాఉండిసమస్యలు పరిష్కరించి అభివృద్ధిచేయడమే తన లక్ష్యమని అడ్లూరి స్పష్టం చేశారు. వెల్గటూర్ ఉమ్మడి మండలం లో 80 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ. 25.56 లక్షల సీఎం సహాయనిది చెక్కులను వెల్గటూర్ మండల పరిషత్ కార్యాలయంలోమంత్రిచేతుల మీదుగా పంపిణి చేశారు.పేద కుటుంబాలు అనారోగ్యంతో వైద్య చికిత్సకోసం ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కోవడంతో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ప్రభుత్వం పేద,మధ్య తరగతి కుటుంబాలకు అండగా నిలుస్తుంద న్నారు.ప్రజలకు అవసరమైన సమయంలో ఆర్థికభరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.అర్హులైన ప్రతి ఒక్కరి కీ ప్రభుత్వసంక్షేమపథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని ఇందులోభాగంగానే ప్రస్తుతం చేయూత పింఛన్ల మంజూరి కోసం ప్రభుత్వం చర్యలు చేపట్టిందని అర్హులైన వారు గ్రామపంచాయతీ ల్లోదరఖాస్తులు సమర్పించాలని మంత్రి పేర్కొన్నారు. పేద ప్రజలకు ఆర్థికభద్రతకల్పించి ప్రజాసంక్షేమమే ద్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని మంత్రి అడ్లూరి పేర్కొన్నారు.ఈకార్య క్రమంలో ప్రజాప్రతినిధులు,అధికారులు కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్య కర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# కోరుట్లలో నషా ముక్త్ భారత్ కోసం విద్యార్థుల్లో అవగాహన

- -చిన్నారులతో చిత్రలేఖనం పోటీ నిర్వహించిన (ఎన్ఎంబిఏ) అంబాసిడర్ : చందా నాగరాజు




**చురకలు ప్రతినిధి కోరుట్ల ఆగస్టు 13 :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చిన 'నషా ముక్త్ భారత్ అభియాన్' 100 వారాల ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలో భాగంగా మత్తు పదార్థాల రహిత సమాజ నిర్మాణం కోసం వినూత్న కార్యక్రమాలు కొనసాగు తున్నాయి. ఇందులో భాగంగా పాఠశాల స్థాయిలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహి స్తున్నారు.గురువారం (ఎన్ఎంబిఏ) అంబాసిడర్ చందా నాగరాజు ఆధ్వర్యం లో 6వ తరగతి విద్యార్థులు, ముఖ్యంగా జెన్ ఆల్ఫా కిడ్స్ కోసం డ్రాయింగ్, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. చిన్నతనం నుంచే 'డ్రగ్స్ రహిత భారత్' అనే భావజాలాన్ని విద్యార్థుల్లో పెంపొందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్పరిణా మాలు,ఆరోగ్యకర మైన జీవనశైలి ప్రాధాన్యతను ప్రతిబింబించేలా విద్యార్థులు వేసిన చిత్రాలు ఆకట్టుకున్నాయి.తమ సృజనాత్మకతతో సామాజిక సందేశాలను చిత్రాల రూపంలో వ్యక్తీకరించారు.ఈ సందర్భం గా పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి. గంగాధర్ విద్యార్థులు రూపొందించిన చిత్రాలను పరిశీలించి వారి సృజనాత్మకతతో పాటు సామాజిక స్పృహను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమాజాన్ని పట్టిపీడిస్తున్న డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టేందుకు ప్రధాన మంత్రి చేపట్టిన 100 వారాల కార్యాచరణ ప్రణాళిక ఎంతో కీలకమని అన్నారు. చిన్నారుల్లో చిన్న వయసు నుంచే మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించడం ద్వారా భవిష్యత్తులో నషా ముక్త్ భారత్ సాధనకు మరింత దోహదపడుతుందని పేర్కొన్నారు. సామాజిక బాధ్యతతో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన (ఎన్ఎంబిఏ) అంబాసిడర్ చందా నాగరాజు కృషిని హెచ్ఎం వి. గంగాధర్ అభినందించారు.

# బీడీ కార్మిక హక్కుల సాధనకు ధర్నా



**చురకలు విలేకరి, జగిత్యాల, ఆగస్టు 13 :** బీడీ కార్మిక హక్కుల సాధనకు ఆగస్టు 17న చేపట్టే దేశవ్యాప్త ధర్నాను విజయవంతం చేయాలని భారతీయ మజ్దూర్ సంఘ్ జగిత్యాల జిల్లా శాఖ పిలువునిచ్చింది. గురువారం భారతీయ మజ్దూర్ సంఘ్ నాయకులు మోత్కూరి సుధీర్ కుమార్ బీడీ కార్మికుల సమస్యలు, గత పదేళ్లుగా బీడీ పరిశ్రమను ఆర్థిక సంక్షోభంలో పెడుతున్న విధానాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమోదిస్తున్నాయన్నారు. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, కనీస పెన్షన్ 7500 రూపాయలకు పెంచాలని, కరువు భత్యం, ఆయుష్మాన్ భారత్, ఈఎస్ఐ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతనాన్ని 30000 రూపాయలకు పెంచాలని, గ్రాచుటీ లెక్కించే విధానాన్ని 30 రో జులకు పెంచాలని, ఈఎస్ఐ పరిధిని 42 వేలకు పెంచాలని, జగిత్యాల జిల్లాలో ఈఎస్ఐ దవాఖాన ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికులకు 50 ఏళ్లు దాటిన వారికి పెన్షన్ అమలు చేయాలని, స్కాలర్షిప్ మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎదులాపురం సత్యనారాయణ, నక్క అశోక్, మారవేని శ్రీనివాస్ పాల్గొన్నారు.

# రాజంపేటలో వైభవంగా 'కళాంజలి' పురస్కారాల ప్రదానం

**చురకలు ప్రతినిధి,వరంగల్ ఆగస్టు 13 :** రాజంపేటలోని శ్రీ ఆంజనేయస్వామి వారి దేవాలయం (శివాలయం ప్రక్కన) ప్రాంగణంలో గురువారం రోజున 'కళాంజలి' సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో భారతదేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవ ముందస్తు వేడుకలు, పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది.కళాంజలి సంస్థ అధ్యక్షులు ఎస్.కళాంజలి నిర్వహణలో జరిగిన ఈ కార్యక్రమానికి జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత



ముమ్మడి నారాయణరెడ్డి,ప్రముఖ న్యాయమూర్తి ఆధ్యాత్మిక ప్రవచనకర్త పసుపులేటి శంకర్,ఆలయ పాలకమండలి చైర్మన్ తలిశెట్టి రమేష్ బాబు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా (హైదరాబాద్ సర్కిల్) మాజీ డిప్యూటీ సెక్రటరీ జనరల్, హైదరాబాద్ నివాసి, ప్రముఖ జానపద కళాకారుడైన తుమ్మ వెంకటేశ్వర్లుకు "నాట్యాచార్య" బిరుదు తో పాటు ఘనంగా పురస్కారాన్ని అందజేశారు.వారి సమాజ సేవలను, కళాసేవను అతిథులు కొనియాడారు. దీనితో పాటు వివిధ రంగాల్లో విశేష సేవలు అందించిన పలువురు ప్రముఖులకు కూడా ఈ వేదికపై బహుమతులు, పురస్కారాలుఅందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు,భక్తులు కళాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### హలో మాల - చలో దుబ్బాక మాల మాల ఉప కులాల

# మహా ధర్నాను విజయవంతం చేయండి

**-జాతీయ మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడి అంజయ్య పిలుపు**

**చురకలు విలేఖరి,బెజ్జంకి ఆగస్టు 13 :** జాతీయ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు పిల్లి సుధాకర్,ర్యాకం శ్రీరాములు రాష్ట్ర పొలిట్ బ్యూరో చైర్మన్ కాల్వ నరేష్ దుబ్బాక నియోజకవర్గ ఇంచార్జ్,రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్మన్ ఎలుక దేవయ్య మాట్లాడుతూ ఈ నెల 23వ తేదీ (ఆదివారం) దుబ్బాక నియోజకవర్గం లోని పట్టణ కేంద్రం లో జరగనున్న మహాధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.బెజ్జంకి మండల కేంద్రం లో



అంబేద్కర్ విగ్రహం వద్ద హలో మాల చలో దుబ్బాక కరపత్ర ఆవిష్కరణ చేయడం జరిగినది.కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు మాలల జనాభా తక్కువ చూపిస్తూ రోస్టర్ విధానంతో మాలలకు మాల ఉప కులాలకు అన్యాయం, జరిగింది రాష్ట్ర ప్రభుత్వం రోస్టర్ విధానాన్ని పునః సమీక్షించాలని ఏబీసీడీ వర్గీకరణ, రోస్టర్ విధానం తదితర అంశాల వల్ల మాలలకు జరుగుతున్న నష్టాన్ని నిరసిస్తూ ఈ మహాధర్నా చేపడుతున్నామని ఆయన పేర్కొన్నారు.అశాస్రియమైన యస్సి వర్గీకరణ ఏక పక్ష రోస్టర్ విధానాన్ని వెంటనే మార్చాలి.గ్రూప్ 3 లో ఉన్న మాల దాని అనుబంధ 25 కులాలకు ఉద్యోగాలు రావడం లేదు వచ్చినవారికి ప్రమోషన్ రావడం లేదు మాలల భవిష్యత్ ను నాశనం చేస్తున్నారు అంబేద్కర్ ఆలోచన కు తూట్ల పొడుస్తున్నారు ఈ రాజ్యాంగ విధానాలను ఎండగట్టడానికి మాలలు అందరూ ఏకం కావాలి 14 జాబ్ నోటిఫికేషన్ ల లో ఎస్సి గ్రూప్ 3 లోని మాలల కుఒక్క పోస్ట్ కూడా రాలేదు.ఈ కార్యక్రమానికి రాష్ట్ర స్థాయి నాయకులు, సిద్దిపేట జిల్లా మాల నాయకులు, దుబ్బాక నియోజకవర్గంలోని మాల కుటుంబ సభ్యులు, నాయకులు, యువత పెద్ద ఎత్తున తరలివచ్చి మహాధర్నాను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాగుల నరసయ్య, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎల శేఖర్ బాబు, దామర శంకర్, రాజ మహేందర్, మాశం బాబు, సంఘం మధు, రాకమ ఆంజనేయులు, రమేష్, సాయి, దొంతుల రాయమల్లు, తిరుపతి, చంద్రయ్య, లక్ష్మణ్, యాస బాబు , జతనం శంకర్, తదితరులు పాల్గొన్నారు.

### ఎల్లారెడ్డిపేటలో క్యాథ్‌ల్యాబ్,

# సూపర్ స్పెషాలిటీగా మారిన అశ్వినిఆసుపత్రి

**-డాక్టర్ జి సత్యనారాయణ స్వామిని అభినందించిన మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్**

**చురకలు ప్రతినిధి,ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 13 :** రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని మేజర్ గ్రామపంచాయతీ ఎల్లారెడ్డిపేట లో క్యాథ్‌ల్యాబ్‌తో కూడిన సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని ఏర్పాటు చేయడం అభినందనీయమని కరీంనగర్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు.గ్రామీణ ప్రాంత ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలను అందుబాటు లోకి తీసుకురావాలనే సదుద్దేశంతో ఈ ఆసుపత్రిని ఏర్పాటు చేయడం మంచి పరిణామమని ఆయన పేర్కొన్నారు. సాధారణంగా క్యాథ్‌ల్యాబ్, సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు జిల్లా కేంద్రాలు, ప్రధాన పట్టణాల్లోనే ఎక్కువగా అందుబాటులో ఉంటాయని,



అలాంటి సదుపాయాలను గ్రామీణ ప్రాంతానికి తీసుకురావడం సంతోష కరమన్నారు.అశ్విని హాస్పిటల్ యజమాని డాక్టర్ సత్యనారాయణ స్వామి గత 46 సంవత్సరాలుగా వైద్యరంగంలో విశిష్ట సేవలు అందిస్తున్నారని వినోద్ కుమార్ కొనియాడారు. గ్రామీణ ప్రజలకు అందుబాటులో ఉంటూ అత్యవసర సమయాల్లో వైద్య సేవలు అందించి అనేక మంది ప్రాణాలను కాపాడారని తెలిపారు. ముఖ్యంగా గుండె సంబంధిత సమస్యలతో బాధపడుతున్న వారికి స్టెంట్లు అమర్చి ప్రాణాలు కాపాడిన సేవలు ప్రశంసనీయమన్నారు .ప్రజలకు సకాలంలో వైద్యం అందుబాటులో ఉంటే అత్యవసర పరిస్థితుల్లో విలువైన ప్రాణాలను రక్షించవచ్చని,గ్రామీణ ప్రాంతంలో క్యాథ్‌ల్యాబ్‌తో కూడిన సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఏర్పాటు తెలంగాణలో వైద్య సేవల విస్తరణకు మంచి ఉదాహరణగా నిలుస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు.డాక్టర్ సత్యనారాయణ స్వామి సేవాభావాన్ని అభినందించిన బోయినపల్లి వినోద్‌కుమార్, ఈ ఆసుపత్రి ద్వారా ఎల్లారెడ్డిపేటతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, మాజీ రాష్ట్ర చైర్మన్ గూడూరి ప్రవీణ్, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, పీఏసీఎస్ చైర్మన్ కృష్ణారెడ్డి, సర్పంచ్ నర్సింహులు, సీనియర్ నాయకులు రాఘవరెడ్డి, రాజిరెడ్డి, నర్సింహారెడ్డి, కిషన్, జక్కుల నాగరాజు, మురళి తదితరులు పాల్గొన్నారు.



# నూతన గ్రామకమిటీ పార్టీ బలోపేతను కృషి చేయాలి

**-సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్**



**చురకలు విలేఖరి వీణవంక ఆగస్టు 13 :** వీణవంక మండలం లస్మక్క పల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసి గ్రామ కాంగ్రెస్ కమిటీని సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు గెల్లు శ్రీనివాస్ అధ్యక్షతన నూతన గ్రామ కమిటీని ఎన్నుకోవడం జరిగింది.మెజార్టీ కార్యకర్తల అభిప్రాయం మేరకు ఏకగ్రీవ ఎన్నిక జరిగింది.అధ్యక్షులుగా గోపు వెంకట్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా దాసారపు లిఖిల్ లు ఏకగ్రీవ ఎన్నుకున్నారు. మిగతా కార్యవర్గాన్ని త్వరలోనే ఎన్నుకోవడం జరుగుతుందని తెలిపారు.కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఎక్కటి రఘుపాల్ రెడ్డి,ఎండీ సాహెబ్ హుస్సేన్,గంగాడి తిరుపతి రెడ్డి,కొమ్మిడి రాకేష్ రెడ్డి,జిల్లా కార్యదర్శి కంకణాల జగదీశ్వర్ రెడ్డి,ఉప సర్పంచ్ దాసారపు శ్రీనివాస్,మాజీ సర్పంచ్ మేకల ఎల్లారెడ్డి, జున్నుతుల మధుకర్ రెడ్డి, డైరెక్టర్ శ్రీపతి రెడ్డి,పల్లెర్ల కిరణ్, ఇస్సాక్, ల తదితరులు ఉన్నారు.

# హమాలి కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి



**చురకలు విలేఖరి వీణవంక ఆగస్టు 13 :** ఆల్ హమాలి వర్కర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో గురువారం వీణవంక మండల కేంద్రంలో ధర్నా నిర్వహించి అనంతరం తహశీల్దార్ వినతి పత్రం అందజేశారు. హమాలి కార్మికులు అనేక సంవత్సరాల నుండి బస్తాలు ఎగుమతులు దిగుమతులు చేస్తూ పనిచేస్తున్నారు.కానీ వారికి ఎలాంటి బెనిఫిట్స్ ప్రభుత్వం నుండి రావరావడ లేదు తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు గడుస్తున్నదనీ,ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టినటువంటి హమాలి కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేస్తామని సంక్షేమ పథకాలు అమలు చేస్తామని తదితర సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు.కానీ ఇంతవరకు ఎలాంటి సమస్యలు పరిష్కరించలేదు.హమాలి కార్మికులకు హెల్త్ కార్డులు జారీ చేసి ఉచిత వైద్య సేవలు అందించాలి.ప్రభుత్వంచే కార్మికుల అందరికీ 55 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి 6000రూపాయలు పింఛను ఇవ్వాలి.ఇండ్లులేని హమాలీ కార్మికుల అందరికీ ప్రభుత్వమే భూమిని కొనుగోలు చేసి 120గజాలస్థలంలో ఇల్లు ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇవ్వాలిప్రభుత్వం నేరుగా గుర్తింపుకార్డులుఅందించాలి. కార్యక్రమంలో అమాలి కార్మికులు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# బాసర ఐఐఐటికి ప్రపంచస్థాయి గుర్తింపు

**చురకలు ప్రతినిధి, నిర్మల్, ఆగష్టు, 13 :** ఐఐఐటి బాసర విద్యా వారోత్సవానికి అంతర్జాతీయ గుర్తింపు లభించింది మే 11 నుంచి 17 వరకు నిర్వహించిన కార్యక్రమాలు ఫోర్బ్స్ వరల్డ్ రికార్డ్స్ లో చోటు దక్కించుకోగా ది వాషింగ్టన్ పోస్టులో ప్రత్యేక కథనం ప్రచురితమైంది. విద్య,ఆరోగ్యం,పర్యావరణం, సుస్థిరాభివృద్ధి మరియు సామాజిక బాధ్యత తదితర అంశాలపై పెద్ద సంఖ్యలో కార్యక్రమాలు నిర్వహించారు. కృషి చేసిన వారికి వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్ ప్రత్యేక అభినందనలు తెలిపారు.



## నూతన నియామకం



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ ఆగస్టు 12 :** కమాన్‌పూర్ మండల రేషన్ డీలర్ల అధ్యక్షునిగా మచ్చ రవీందర్ (గుండారం) ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షునిగా జంగపల్లి ఎర్రయ్య (పేరా పల్లి) కోశాధికారి ఈదునూరి శంకరమ్మ( కమాన్ పూర్) కార్యదర్శిగా ఆబిడి తిరుపతమ్మ (జూలపల్లి) ప్రధాన కార్యదర్శిగాకేశెట్టి చంద్రశేఖర్ (కమాన్ పూర్) కమిటీ సభ్యులు. కేశెట్టి శ్రీనివాసు, కటకం నారాయణ.గంధం కృష్ణ. మేకల స్వామి అబిడి తిరుపతమ్మ తాటి పెల్లి భూమయ్య పంతకాని రవి.మల్లేష్ తదితలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మచ్చ రవీందర్ మాట్లాడుతూ రేషన్ డీలర్ల సమస్యలపై పోరాటం చేస్తానని పేర్కొన్నారు.నన్ను ఏకగ్రీవంగా ఎన్నుకున్న వారందరికీ ధన్యవాదాలు అని మచ్చ రవీందర్ అన్నారు.

## శ్రీనివాసరావు సేవలు మరువలేనివి

**-కెసిఆర్ బావమరిది మృతికి నివాళులర్పించిన ఓసి జేఏసీ నేత పోలాడి**



**చురకలు ప్రతినిధి హుజురాబాద్ ఆగస్టు 13 :** మాజీ ముఖ్యమంత్రి, బి ఆర్ ఎస్ అధినేత కెసిఆర్ బావమరిది జోగినపల్లి శ్రీనివాసరావు సేవలు మరువలేనివని, ఆయన మృతి అత్యంత బాధాకరమని ఓసి జేఏసీ నేత పోలాడి రామారావు అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కెసిఆర్ బావమరిది శ్రీనివాసరావు అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాదులో చికిత్స పొందుతూ మృతి చెందడం అందరినీ కలచి వేసిందని అన్నారు. ఆయన ఈ డబ్ల్యూ ఎస్ అమలు కోసం పోరాటానికి మద్దతునిచ్చారని గుర్తు చేశారు. ఓ సి జె ఎ సి నేతలను నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ దగ్గరికి స్వయంగా తీసుకువెళ్లారని తెలిపారు. ఆయన లేని లోటు పూడ్చలేనిదని పేర్కొంటూ ఆయన మృతికి సంతాపాన్ని కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు.

## మాజీ జెడ్పీటీసీ చీటీ లక్ష్మణరావును పరామర్శించిన మాజీ ఎంపీ వినోద రావు



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట ఆగస్టు 13 :** ఎల్లారెడ్డిపేట మండల మాజీ జెడ్పీటీసీ బిఆర్ఎస్ పార్టీ నాయకులు చీటీ లక్ష్మణరావు మాతృమూర్తి రత్నమాలమ్మ అనారోగ్యంతో ఇటీవల మరణించారు.ఈ సందర్భంగా కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ గురువారం హరిదాస్‌నగర్ గ్రామంలోని వారి నివాసానికి విచ్చేసి లక్ష్మణ్ రావు తో పాటు వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.రత్నమాలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు, వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో భారత రాష్ట్ర సమితి రాష్ట్ర ప్రతినిధి గూడూరి ప్రవీణ్ న్యాలకొండ రాఘవరెడ్డి ఎల్లారెడ్డిపేట సర్పంచ్ ఎలగందుల నరసింహులు ఏఎంసీ మాజీ చైర్మన్ గుల్లపల్లి నరసింహారెడ్డి బిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు అందే సురేష్ ఎడ్ల సందీప్ రాము యాదవ్ , ఉప్పుల చినరాజం నాయకులు,కార్యకర్తలు పార్టీ శ్రేణులు పాల్గొన్నారు,

## గంగారాం తండాలో ఘనంగా తీజ్ ఉత్సవాలు



**చురకలు విలేకరి, కొడిమ్యాల, ఆగస్టు 13 :** కొడిమ్యాల మండలం గంగారాం తండాలో తీజ్ ఉత్సవాలు గురువారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా సర్పంచ్ వినోద్ నాయక్, నాయకులు, మహిళలు, యువతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. 9 రోజుల పాటు సేద్దలతో తీజ్ అమ్మవారిని, సేవలాల్ మహారాజ్ను పూజించారు. రాష్ట్రం, దేశం, గ్రామం మంచి వర్షాలు పడాలని ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, మహిళలు, యువతులు పాల్గొన్నారు.

# పాత్రికేయుల కుటుంబాలకు ద్రోహం చేస్తారా?

**-హుజూరాబాద్‌లో పాత్రికేయుల నిరసనలు**
**-గూడూరి స్వామిరెడ్డిని కాంగ్రెస్ సస్పెండ్ చేయాల్సిందే**
**-జర్నలిస్టులు, ప్రజాసంఘాల భారీ ఆందోళన**



**చురకలు ప్రతినిధి హుజురాబాద్ ఆగస్టు 13 :** హుజురాబాద్ లో పాత్రికేయులకు ప్రభుత్వం ఇచ్చిన నివేశన స్థలాలపైన కక్షపూరితంగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ నాయకుడు గూడూరు స్వామిరెడ్డి తీరును నిరసిస్తూ గురువారం ఆగ్రహజ్వాలలు మిన్నంటాయి. జర్నలిస్టులకు గత ప్రభుత్వం కేటాయించిన ఇళ్ల స్థలాలపై న్యాయస్థానంలో వేసిన కేసును వెంటనే ఉపసంహరించుకోవాలని, సొంత పార్టీ మంత్రులను సైతం దుర్భాషలాడుతున్న స్వామిరెడ్డిని కాంగ్రెస్ నుంచి తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ హుజూరాబాద్ ప్రెస్ క్లబ్, ప్రజా సంఘాల ఉమ్మడి ఆధ్వర్యంలో పట్టణం లో భారీ ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. పట్టణ ప్రధాన రహదారుల మీదుగా భారీ ర్యాలీతో నిర్వహించారు. పాత్రికేయులతో పాటు ప్రజాసంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామిరెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పాత్రికేయుల ఉద్యమానికి సంఘీభావం ప్రకటించారు.

**50 మంది విలేకరుల పొట్ట కొట్టే కుట్ర...**

హుజూరాబాద్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కాయిత రాములు, ప్రధాన కార్యదర్శి కామని రవీందర్.. కాంగ్రెస్ నేత స్వామి రెడ్డి వైఖరిపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.ఎలాంటి సంబంధం లేకపోయినా కేవలం కక్ష సాధింపు ధోరణితోనే కోర్టును ఆశ్రయించి 50 మంది పేద విలేకరుల కడుపు కొట్టేందుకు స్వామిరెడ్డి దారుణమైన కుట్రలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. గత 20 ఏళ్లుగా అద్దె ఇళ్లలో ఉంటూ అరకొర ఆదాయంతో దయనీయ జీవితాలు గడుపుతున్న పాత్రికేయుల స్థలాలను లాక్కోవాలని చూస్తే సహించేదిలేదని హెచ్చరించారు. అధికారపార్టీలో ఉంటూనే మంత్రులకు, క్షేత్రస్థాయి నాయకులకు మచ్చ తెచ్చేలా ప్రవర్తిస్తున్న ఆయనపై పార్టీ అధిష్ఠానం తక్షణమే చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

**బోగస్ బిల్లులు.. ప్రభుత్వ భూమి కబ్జా...**

స్వామిరెడ్డిపై తీవ్రస్థాయిలో అక్రమాల ఆరోపణలు వెల్లువెత్తాయి. ఏ పని చేయకుండానే ఎం బి రికార్డులు సృష్టించి లక్షలాది రూపాయల ప్రభుత్వ బిల్లులు పొందుతున్నాడని నిరసన కారులు బహిరంగంగా ఆరోపించారు. అంతేకాకుండా, హుజూరాబాద్ పట్టణంలోని సర్వే నంబర్ 125లో గల దాదాపు 300 గజాల విలువైన ప్రభుత్వ భూమిని ఆక్రమించి అక్రమంగా తన వ్యక్తిగత కార్యాలయాన్ని నిర్మించు కున్నారని ధ్వజమెత్తారు. పనులు చేయకుండానే ఎంబి రికార్డులు సృష్టిస్తూ, ప్రభుత్వ ఆస్తులను ఆక్రమించే ఇటువంటి వ్యక్తులు జర్నలిస్టుల స్థలాలపై కేసులు వేయడం విడ్డూరంగా ఉందని దుయ్యబట్టారు. "జర్నలిస్టుల ఇళ్ల స్థలాల వ్యవహారంలో నిర్లక్ష్యం తగదు. రాష్ట్ర ప్రభుత్వ మంత్రులు, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ ప్రణవ్ బాబు తక్షణమే జోక్యం చేసుకుని ఈ కోర్టు కేసుల చిక్కుముడిని విప్పాలి. విలేకరులకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆపేది లేదు." అని ప్రెస్ క్లబ్ ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

**కళాకారుల ఆటపాటలు.. దద్దరిల్లిన నిరసన..**

ర్యాలీ అనంతరం నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో జర్నలిస్టుల హక్కులు, ఆత్మగౌరవంపై కళాకారులు ఆలపించిన ఉద్యమ గీతాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.వారి ఆటపాటల తో నిరసన ప్రాంగణం ఉద్యమ వాతావరణాన్ని తలపించింది.ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు చందుపట్ల జనార్ధన్, వేల్పుల రత్నం, సందెల వెంకన్న, ప్రియదర్శిని, మాడుగుల ఓదెలు, సీనియర్ జర్నలిస్ట్ అంబాల ప్రభాకర్‌తో పాటు నియోజకవర్గ పరిధిలోని పాత్రికేయులు, ప్రజాసంఘాల నాయకులు, భారీ సంఖ్యలో పాల్గొని మద్దతు తెలిపారు. స్వామిరెడ్డి వైఖరి మారకపోతే ఆందోళనలను మరింత తీవ్రతరం చేస్తామని ఈ సందర్భంగా నాయకులు హెచ్చరించారు.

### ఆపదలో ధైర్యసాహసాలు..

# బాలిక ప్రాణాలు కాపాడిన యువకులకు సన్మానం

**-గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్ అభినందనలు**




**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ ఆగస్టు 13 :** బొక్కలవాగులో ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోతున్న బాలికను ధైర్యసాహసాలతో రక్షించిన బోయినిపేటకు చెందిన అంకం శేఖర్, ఆకుల అరవింద్‌లను గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్ తన కార్యాలయంలో అభినందించి సన్మానించారు.మంథని పోలీస్ స్టేషన్ పరిధిలోని బొక్కలవాగు వద్ద బోయినిపేటకు చెందిన పర్శవేన రాజు తన కుమార్తె అలేఖ్యతో కలిసి గొర్రెల మందను వాగు దాటించే ప్రయత్నం చేస్తుండగా ప్రమాదవశాత్తు నీటి ప్రవాహంలో జారిపడ్డాడు.తండ్రిని కాపాడేందుకు ప్రయత్నించిన అలేఖ్య కూడా నీటిలో మునిగిపోతూ కేకలు వేసింది.అదే సమయంలో అటుగా వెళు తున్న అంకం శేఖర్ వెంటనే స్పందించి నీటిలోకి దిగి అలేఖ్యను సురక్షితంగా బయటకు తీసుకొచ్చాడు. అప్పటికే ఆమె స్పృహ కోల్పోవడంతో శేఖర్, ఆకుల అరవింద్ కలిసి ప్రథమ చికిత్స అందించి ఆమెను స్పృహలోకి తీసుకువచ్చారు. అనంతరం అలేఖ్య తన తండ్రి కూడా నీటిలో మునిగిపోయినట్లు చెప్పడంతో ఇద్దరూ వాగులోకి దిగి రాజును బయటకు తీసుకొచ్చి ఆసుపత్రికి తరలించారు.అయితే అప్పటికే రాజు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.ఆపద సమయంలో ప్రాణాలకు తెగించి బాలికను కాపాడటంతో పాటు ఆమె తండ్రిని రక్షించేందుకు ప్రయత్నించిన శేఖర్, అరవింద్‌ల ధైర్యసాహసాలను ఏసీపీ ఎం.రమేష్ అభినందించారు. ఏసీపీ కార్యాలయంలో మంథని సీఐ బుద్ధె స్వామి,ఎస్ఐ సాగర్‌ల సమక్షంలో వారిని శాలువాలతో సత్కరించి,ఆపదలో మానవత్వంతో స్పందించినందుకు అభినందనలు తెలిపారు.ఆపదలో ఉన్నవారిని రక్షించేందుకు సమయస్ఫూర్తితో స్పందించడం అభినందనీయమని, వారి ధైర్యసాహసాలు సమాజానికి స్ఫూర్తిదాయకమని ఏసీపీ పేర్కొన్నారు.

# లక్ష్మణచాంద మండల కాంగ్రెస్ కమిటీ నూతన కార్యవర్గం



**చురకలు ప్రతినిధి,నిర్మల్, ఆగష్టు, 13 :** నిర్మల్ జిల్లా లక్ష్మణచాంద మండలం కాంగ్రెస్ పార్టీ నూతన కార్యవర్గం ఏర్పాటైంది. మండల కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి సూది.రాజన్న ఆధ్వర్యంలో పార్టీ అధ్యక్షుడు నరేష్ రెడ్డి సమక్షంలో నూతన కమిటీ సభ్యుల నియామక జాబితాను కాంగ్రెస్ అధిష్ఠానానికి పంపించారు.ఈ సందర్భంగా మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేయాలని నిర్ణయించారు.నూతన కార్యవర్గంలో వైస్ ప్రెసిడెంట్లుగా జి. గంగాధర్ గౌడ్, బుర్రి. మహేష్, జనరల్ సెక్రటరీలుగా పుట్టి.హరీష్, మేకల.వంశీ, గూగులవత్ సంతోష్, శ్రీకాంత్, నియమితులయ్యారు. సెక్రటరీలుగా పుల్ల హరీష్, మేకల వెంకీ, గురులావత్ సంతోష్, శ్రీకాంత్, షేక్ ఫిరోజ్, సిర్ర.లింగన్న, బెల్లం నరేష్‌లను ఎంపిక చేశారు. ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా కుంటాల శ్రీనివాస్, ములావత్. వెంకట్రావు, సబ్బాని.నర్సయ్య, ద్యాగరి లక్ష్మి, నీలి.భీమలక్ష్మి, తాండ్ర రాజేశ్వర్, బొజ్జ అశోక్, కొముకుల అశోక్‌లను నియమించారు. నూతన కార్యవర్గం పార్టీ బలోపేతంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని నాయకులు సూచించారు

# శ్రావణ తొలి శుక్రవారం : ప్రకృతి కాంతి.. పరిపూర్ణ మంగళాశాసనం

## సిరుల జల్లుల శ్రావణం.. శివ-శక్తి సమారాధనం



**రామ కిష్టయ్య సంగన భట్ల**
**సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్**
**కాలమిస్ట్...9440595494**

శ్రావణ మాసం అంటేనే తెలుగింట ఆధ్యాత్మిక పరిమళాలు వెదజల్లే పవిత్ర కాలం. వర్షఋతువు రాకతో పచ్చని ప్రకృతి నూతన కళను సంతోషంగా అద్దుకుంటుంటే,ఆలయ ఘంటానాదాలు , వేదమంత్రోచ్చారణలు, నిత్య ధూపదీప నైవేద్యాలతో ప్రతి ఇల్లూ వాకిలీ భక్తిభావంతో పులకించి పోతాయి. తెలుగు పంచాంగ సంప్రదాయం ప్రకారం 2026 ఆగస్టు 13న దక్షిణాయనంలో శ్రావణ మాస శుభారంభం జరిగి సెప్టెంబరు 11 వరకు కొనసాగుతుంది. ఈ క్రమంలో ఆగస్టు 14న శ్రావణ శుక్ల విదియ తిథితో లక్ష్మీ సమారాధనకు అత్యంత విశేషమైన తొలి శుక్రవారం రావడం గమనార్హం. మన దేశంలో ముఖ్యంగా ఉత్తర భారతదేశంలో పౌర్ణిమాంత పద్ధతి (పౌర్ణిమతో నెల పూర్తయ్యే విధానం) పాటిస్తుండగా, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ వంటి దక్షిణ భారత ప్రాంతాల్లో అమావాస్యాంత పంచాంగ విధానాన్ని అనుసరిస్తారు. ఈ కాలమాన వైవిధ్యం వల్ల మాస ప్రారంభ తేదీల్లో వ్యత్యాసాలు కనిపిస్తాయి తప్ప, ఇవి రెంటికీ సంప్రదాయంలో సమాన ప్రామాణికత ఉంది.భారతీయ సంస్కృతిలో శ్రావణానికి అత్యున్నత స్థానముంది. వేదకాలం నుంచే ప్రకృతి సౌందర్యానికి, యజ్ఞయాగాదులకు, దేవతారాధనకు ఈ మాసం నిలయమైంది. "శ్రవణం" అనగా శ్రద్ధగా వినడం అని అర్థం. అందుకే ఈమాసంలో శ్రీమద్రామాయణం, భాగవతం వంటి పురాణ శ్రవణం, హరికథలు, వేదపఠనం, కనకధారా స్తోత్ర పారాయణలకు అత్యంత ప్రాధాన్యం ఉంటుంది.

శివకేశవులకు అభేద రూపంగా భావించే ఈ మాసంలో, సోమవారాలు హర ఆరాధనకు, శుక్రవారాలు హరిప్రియ అయిన లక్ష్మీదేవి పూజకు కేటాయించడం మన పూర్వీకుల ఆధ్యాత్మిక ప్రాశస్త్యానికి నిదర్శనం. తెలుగువారి గృహసీమల్లో శ్రావణ శుక్రవారం ఒక పవిత్రమైన పండుగ వాతావరణాన్ని తీసుకొస్తుంది. తెల్లవారుజామునే ఇల్లు శుభ్రం చేసి, గడపలకు పసుపు కుంకుమలు దిద్ది, రంగురంగుల ముగ్గులతో ముంగిళ్లను తీర్చిదిద్దుతారు. మామిడి తోరణాలు, సువాసనల పూలతో పూజామందిరాన్ని అలంకరించి, ధనధాన్య రూపిణి అయిన శ్రీమహాశ్రీని ఇంట ఆహ్వానిస్తారు. అష్టోత్తర శతనామావళి, శ్రీసూక్త విధానేన అర్చనలు నిర్వహించి, పిండివంటలను నైవేద్యంగా సమర్పిస్తారు.పూజ అనంతరం ముత్తైదువులను పిలిచి తాంబూలాలు ఇవ్వడం కేవలం ఒక ఆచారం మాత్రమే కాదు; అది ఆత్మీయతల కలబోత, సంక్షేమాకాంక్షల ప్రతిరూపం. సంప్రదాయంలో లక్ష్మీదేవిని కేవలం ధనరూపంలోనే చూడటం పరిమిత భావన అవుతుంది. లక్ష్మీతత్త్వం అనగా సర్వతోముఖ సమృద్ధి. సంస్కృతంలో లక్ష్మీ అనగా "లక్ష్యతే యయా సా లక్ష్మీః" అంటే అర్థం... "దేని ద్వారా (శుభం, సంపద, ఐశ్వర్యం మొదలైనవి) గుర్తించ బడుతుందో/ ప్రకాశిస్తాయో, అది లక్ష్మి." అందుకే అష్టలక్ష్ముల రూపాల్లో ధన,ధాన్య,ధైర్య, విద్యా,విజయ,సంతాన,గజ, ఆదిలక్ష్ములుగా పరాశక్తి వ్యాపించి ఉంది. సంపదను కూడబెట్టడమే కాక,దానిని సమాజ శ్రేయస్సుకు,ధర్మ కార్యాలకు వినియోగించాలనే పరమార్థాన్ని ఈ భావన నొక్కి చెబుతుంది.ఈ మాసంలో లక్ష్మీపూజలన గానే అందరికీ గుర్తొచ్చేది వరలక్ష్మీ వ్రతం.అయితే తొలిశ్రావణ శుక్రవారమే వరలక్ష్మీ వ్రతం కాదనే విషయం గుర్తించాలి. పంచాంగ నియమావళి ప్రకారం శ్రావణ శుక్లపక్ష పౌర్ణిమకు ముందుగా వచ్చే శుక్రవారమే వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరిస్తారు.ఈ క్రమంలో 2026లో ఆగస్టు 21న శ్రావణ పూర్ణిమ ముందు రోజుగా వరలక్ష్మీ వ్రతం ప్రాప్తిస్తుండగా,ఆగస్టు 14తొలి శుక్రవారాన్ని సాధారణ లక్ష్మీదేవి ఆరాధనకు, దీపారాధనలకు శుభప్రదమైన ప్రారంభ దినంగా పరిగణించాలి.శ్రావణ సంస్కృతి వ్యవసాయ జీవనంతో గాఢంగా ముడిపడి ఉంది. వర్షపాతంతో వాగులు వంకెలు నిండి,పొలాలు పచ్చదనంతో మురిసిపోయే ఈ కాలం, రైతులకు భావి పంట దిగుబడిపై ఆశలు రేకెత్తిస్తుంది.ఆ పచ్చదనమే లక్ష్మీ స్వరూపంగా భావించి పూజించడం మన ప్రకృతి సమన్వయ జీవన విధానానికి సాక్ష్యం.అలాగే "ఇల్లు ఇల్లాలితో ఇలవేల్పు" అనే నానుడికి సార్థకత చేకూరుస్తూ, స్త్రీలు తమ కుటుంబ రక్షణకు, సమృద్ధికి మూలధనంగా నిలిచే పర్వదినమిది.బంధుమిత్రులను ఆతిథ్యంతో అలరించడం వల్ల సామాజిక బంధాలు, పొరుగువారితో సంబంధాలు బలపడతాయి.ఇక వ్రతం యొక్క అంతరార్థం కేవలం ఉపవాసం లేదా పూజలకే పరిమితం కాదు. మనస్సును దుర్గుణాలకు దూరం చేసి, ఆత్మ నిగ్రహం పెంపొందించుకోవడమే నిజమైన దీక్ష."సర్వేజనాః సుఖినో భవంతు"అనే ఆర్ష వాక్యానికి అనుగుణంగా,లక్ష్మీదేవి పూజతో పాటు అన్నదానం, ఆకలిగొన్నవారికి సహాయం, పేద విద్యార్థులకు పుస్తకాల పంపిణీ,గోసేవ వంటి సేవాకార్యక్రమాలను చేపట్టినప్పుడే ఆధ్యాత్మిక సాధనకు సామాజిక ప్రయోజనం సిద్ధించి, దైవానుగ్రహం లభిస్తుంది.ప్రత్యేకించి 2026లో ఆగస్టు 13న శ్రావణ మాసం మొదలై, ఆగస్టు 14న తొలి శుక్రవారం సంభవించడం, దానికి తక్షణమే ఆగస్టు 15న 80వ భారత స్వాతంత్ర్య దినోత్సవం జతకావడం మరో అద్భుత ఘట్టం.దివ్యమైన ఆధ్యాత్మిక సంస్కృతికి, విశిష్టమైన జాతీయ చైతన్యం తోడుకావడంతో ఈ పర్వదిన శోభ మరింత ద్విగుణీకృతమవుతోంది. భక్తి అనేది హృదయాన్ని పవిత్రం చేయాలి, సంపద మానవ సేవకుమార్గం కావాలి, ఆచారం మానవతా విలువలను నిలబెట్టాలి.అప్పుడే శ్రావణ శుక్రవారాన వెలిగించే ప్రతి దీపం ఒక ఇంటికి మాత్రమే కాక,సమాజానికి సమగ్ర కాంతిని ఇచ్చే దివ్యజ్యోతిగా భాసిల్లుతుంది.

## శ్రావణమాసంలోనైనా రాజన్న భక్తులకు

# దర్శనం కల్పించాలి : బీజేపీ

**-కలెక్టర్ గరీమ అగ్రవాల్‌కు వినతిపత్రం అందజేసిన జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి**



**చురకలు ప్రతినిధి,ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 13 :** వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనుల కారణం గా గత తొమ్మిది నెలలుగా భక్తులకు స్వామివారి దర్శనం పరిమితమైందని, దీనివల్ల భక్తుల మనోభావాలు దెబ్బతింటున్నాయని బీజేపీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి అన్నారు. శ్రావణమాసంలోనైనా భక్తులందరికీ రాజన్న దర్శన భాగ్యం కల్పించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ గరీమ అగ్రవాల్ కు ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గోపి మాట్లాడుతూ, గత తొమ్మిది నెలలుగా దర్శనం కోసం ఎదురుచూస్తున్న భక్తులకు ఇకపై మరింత జాప్యం చేయకుండా శ్రావణమాసంలోనే శ్రీ రాజరాజేశ్వర స్వామివారి దర్శనానికి అవకాశం కల్పించాలని భారతీయ జనతా పార్టీ తరఫున డిమాండ్ చేశారు.అభివృద్ధి పనులు కొనసాగు తున్నప్పటికీ భక్తుల ఆధ్యాత్మిక భావోద్వేగాలు, విశ్వాసాలను దృష్టిలో ఉంచుకుని దర్శనానికి తగిన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని అధికారులను కోరారు.అభివృద్ధి పనులకు భక్తులు పూర్తిగా సహకరిస్తారని, అదే సమయంలో వారి విశ్వాసాన్ని గౌరవిస్తూ దర్శన ఏర్పాట్లపై ప్రభుత్వం, ఆలయ అధికారులు తక్షణ నిర్ణయం తీసుకోవాలని ఆయన అన్నారు.శ్రావణమాసం అత్యంత పవిత్రమైన మాసమని, ఈ సమయంలో రాజన్నను దర్శించుకోవాలని భక్తులు ఎంతో ఆతృతగా ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. భక్తుల విశ్వాసాన్ని గౌరవించి వెంటనే దర్శన ఏర్పాట్లు కల్పించాలని బీజేపీ తరఫున డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పొన్నాల తిరుపతిరెడ్డి, జిల్లా కోశాధికారి ఆసానిరామలింగారెడ్డి, సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు దుమాల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ హైస్కూల్ మూసివేతను అడ్డుకున్న ఏబీవీపీ



**చురకలు విలేఖరి వీణవంక ఆగస్టు 13 :** వీణవంక మండలం ఘన్ముక్ల గ్రామంలోని ప్రభుత్వ హైస్కూల్‌ను విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందనే కారణంతో మూసివేసే ప్రక్రియను ఏబీవీపీ ఆధ్వర్యంలో అడ్డుకోవడం జరిగిందని ఏబీవీపీ వీణవంక మండల్ కన్వీనర్ సిద్ధార్థ్ అన్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ..పాఠశాలను మూసివేయడం వల్ల గ్రామీణ ప్రాంత విద్యార్థులు విద్యకు దూరమయ్యే అవకాశం ఉందని అన్నారు.పాఠశాలను మూసివేయకుండా కొనసాగిస్తూ, అవసరమైన మౌలిక వసతులు, ఉపాధ్యాయులను కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు."బడిలో బడి ఉండాలి.. ఊరిలో బడి ఉండాలి.. బడి ఉంటేనే ఊరి భవిష్యత్తు ఉంటుంది" అని పేర్కొన్నారు. గ్రామంలో ప్రభుత్వ హైస్కూల్‌ను కొనసాగించే వరకు విద్యార్థుల పక్షాన ఏబీవీపీ పోరాడుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కోడిపందాల స్థావరాలపై పోలీసుల దాడులు



**చురకలు విలేకరి,ధర్మపురి,ఆగస్టు 13 :** ధర్మపురి మండలంలోని రాయపట్నం గ్రామంలో కోళ్ల పందాలు ఆడుతున్నారని పక్కా సమాచారంతో ధర్మపురి ఎస్సై నాగపురి సధాకర్ గురువారం తన సిబ్బందితో దాడి చేశారు. పోలీసులను పసిగట్టిన పలువురు పందెం రాయుళ్లు పరారైనట్లు తెలిసింది. దాడులలో ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని ఐదు ద్విచక్ర వాహనాలు, ఒక కారు, మూడు పందెం కోళ్లు, వేయి రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సధాకర్ తెలిపారు.

## గొల్లపల్లిలో విచ్చలవిడిగా బియ్యం దందా

**-స్టేషన్ ముందు నుంచి బియ్యం తరలింపు**
**-పోలీసులకు సవాల్ గా మారిన అక్రమ దందా**



**చురకలు విలేకరి, గొల్లపల్లి,ఆగస్టు 13 :** గొల్లపల్లి మండలంలో విచ్చలవిడిగా రేషన్ బియ్యం దందా కొనసాగుతుంది. గ్రామాల్లో రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి జగిత్యాలకు తరలిస్తుంటారు. బియ్యం దందా చేసేది ముఖ్యంగా గుంజపడుగు గ్రామానికి చెందిన ఉంటారు. ప్రతినెల ఊరురా తిరుగుతూ రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి జగిత్యాలకు తరలించి అధికధరకు విక్రయిస్తుంటారు. ఇంత జరుగుతున్న స్థానిక పోలీసులు కానీ అధికారులు కానీ పట్టించుకున్న పాపాల పోలేదనీ విమర్శలు ఉన్నాయి.పోలీసులు ఈ మధ్యకాలంలో గుంజపడుగు గ్రామంలో బియ్యాన్ని కొనుగోలు చేసే ఇళ్లన్నీ తనిఖీ చేసి హెచ్చరికలు తయారు చేశారు. పోలీసుల హెచ్చరికలను కాదని స్టేషన్ ముందు నుంచే పిడిఎఫ్ బియ్యాన్ని పట్టుకొని జగిత్యాలకు తరలిస్తుండడం విశేషం. ప్రతినెల 5వ తారీఖు నుంచి 15వ తారీకు వరకు ఈ దందా కొనసాగుతుంది. మరి ఈ నెలలో మూడు నెలల రేషన్ బియ్యం ప్రభుత్వం పంపిణీ చేస్తుండగా బియ్యాన్ని తీసుకున్న వెంటనే విక్రయిస్తున్నారు. ఉచితంగా వచ్చే బియ్యానికి కిలో ఒక్కంటికే రూ.18 నుంచి రూ.20 ల వరకు విక్రయిస్తుంటారు. కొనుగోలు చేసిన బియ్యాన్ని వెంటనే జగిత్యాలకు తరలిస్తుంటారు.అది కూడా చేసిన ముందే తరలించడం అనుమానాలకు తావిస్తోంది.

# రామగిరి జిల్లాపై సందడే... సందడి...

**-శ్రావణమాసం.. భక్తులతో కిటకిట**

**జబ్బార్ ఖాన్,కమాన్ పూర్,చురకలు ప్రతినిధి,పెద్దపల్లి జిల్లా :** పెద్దపల్లి జిల్లాలో అతి ముఖ్యమైన ప్రదేశాల్లో రామగిరి జిల్లా ఒకటి.

**దీని చరిత్ర ఇలా ఉంది.**

శ్రావణ మాసం వచ్చిందంటే చాలు.. పెద్దపల్లి జిల్లాలోని రామగిరి మండలంలోని రామగిరి ఖిల్లా పర్యాటకులతో సందడిగా మారుతుంది. చరిత్రకు సాక్ష్యంగా నిలిచిన ఈ ఖిల్లా ప్రకృతి అందాలతో మమేకమై పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఎత్తైన కొండపై విస్తరించిన కోట నిర్మాణాలు, పురాతన కట్టడాల ఆనవాళ్లు, కొండల మధ్య పచ్చని ప్రకృతి దృశ్యాలు రామగిరి ఖిల్లాకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.

**చరిత్రను చాటే రాతి కట్టడాలు**

రామగిరి ఖిల్లా తెలంగాణలోని ప్రముఖ చారిత్రక ప్రదేశాల్లో ఒకటిగా గుర్తింపు పొందింది. శతాబ్దాల చరిత్రను తనలో దాచుకున్న ఈ ప్రాంతంలో పురాతన కోట గోడలు, రాతి నిర్మాణాలు, బురుజులు, శిథిలావస్థకు చేరిన కట్టడాలు గత వైభవాన్ని కళ్లకు కట్టినట్లు చూపిస్తాయి. ఖిల్లా పరిసరాల్లో అడుగుపెట్టగానే అప్పటి రాజులు, పాలకులు నిర్మించిన రక్షణ వ్యవస్థలు, కోట నిర్మాణ నైపుణ్యం గురించి



తెలుసుకునే అవకాశం పర్యాటకులకు లభిస్తుంది.

**శ్రావణంలో ప్రకృతి సోయగం**

వర్షాకాలంలో రామగిరి ఖిల్లా అందాలు మరింత రెట్టింపవుతాయి. కొండలపై పచ్చదనం పరుచుకోవడంతో పాటు వర్షపు నీటితో ప్రకృతి సరికొత్త రూపాన్ని సంతరించుకుంటుంది. కొండపై నుంచి చుట్టుపక్కల ప్రాంతాలను వీక్షిస్తే పచ్చని పొలాలు, కొండలు, గ్రామీణ ప్రాంతాల అందాలు కనువిందు చేస్తాయి. దీంతో శ్రావణ మాసంలో కుటుంబాలతో, స్నేహితులతో కలిసి ఖిల్లాను సందర్శించే వారి సంఖ్య పెరుగుతోంది.

**యువతకు ప్రత్యేక ఆకర్షణ**

ప్రకృతి అందాలు, చారిత్రక కట్టడాలు కలగలిసిన రామగిరి ఖిల్లా యువతను కూడా విశేషంగా ఆకర్షిస్తోంది. కొండ ప్రాంతంలో నడక, ప్రకృతి వీక్షణ, ఫొటోలు తీసుకోవడం వంటి వాటికి అనువైన వాతావరణం ఉండటంతో వారాంతాల్లో సందర్శకుల రద్దీ కనిపిస్తోంది. వర్షాకాలంలో ఖిల్లా పరిసరాల్లో పచ్చదనం మరింత ఆకట్టుకోవడంతో సామాజిక మాధ్యమాల్లోనూ ఈ ప్రాంతానికి సంబంధించిన చిత్రాలు, దృశ్యాలు విస్తృతంగా కనిపిస్తున్నాయి.

**పర్యాటకంగా మరింత అభివృద్ధి చేయాలి**

చారిత్రక ప్రాధాన్యతతో పాటు ప్రకృతి సౌందర్యం ఉన్న రామగిరి ఖిల్లాను మరింత అభివృద్ధి చేస్తే పెద్దపల్లి జిల్లాలోనే ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే అవకాశం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. పర్యాటకులకు అవసరమైన మౌలిక వసతులు, తాగునీరు, మరుగుదొడ్లు, విశ్రాంతి ప్రదేశాలు, సమాచార ఫలకాలు, రహదారి సౌకర్యాలను మెరుగుపరిస్తే సందర్శకుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. ఖిల్లా చారిత్రక విశిష్టతను వివరించే ప్రత్యేక పర్యాటక సమాచార కేంద్రాన్ని ఏర్పాటు చేయడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

**చరిత్రను తెలుసుకుంటూ.. ప్రకృతిని ఆస్వాదిస్తూ**

శ్రావణ మాసంలో రామగిరి ఖిల్లాను సందర్శించడం అంటే ఒకవైపు తెలంగాణ చరిత్ర వైభవాన్ని తెలుసుకోవడం, మరోవైపు వర్షాకాల ప్రకృతి అందాలను ఆస్వాదించడం. పెద్దపల్లి జిల్లాలో ఉన్న ఈ చారిత్రక సంపదను కాపాడుకుంటూ భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది. సరైన ప్రాచుర్యం, పర్యాటక అభివృద్ధి చర్యలు అందితే రామగిరి ఖిల్లా జిల్లా పర్యాటక పటంలో మరింత ప్రత్యేక స్థానాన్ని సంపాదించే అవకాశం ఉంది.



# వృద్ధుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



**-రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**

**చురకలు విలేకరి, జగిత్యాల, ఆగస్టు 13 :** వృద్ధుల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వం పని చేస్తున్నదని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు.గురువారం ధర్మపురిలో మంత్రిక్యాంపు కార్యాలయంలో తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు హరి అశోక్‌కుమార్ ముద్రించిన వృద్ధుల రక్షణ చట్టం పుస్తకాలను మంత్రి ఆవిష్కరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ జగిత్యాల జిల్లా లో సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ ప్రభుత్వ కమిటీ ప్రతినిధులు జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్ ఆధ్వర్యంలో నిరాధరణకు గురవుతున్న వృద్ధుల కేసుల పరిష్కారం లో చేస్తున్న కృషి ని అభినందించారు.అసోసియేషన్ కౌన్సిలింగ్ కేంద్రం విషయంలో ఆందోళన వద్దని,అసోసియేషన్ విధులకు వెంటనే తగు వసతి కల్పించాలని కలెక్టర్‌కు సూచించామన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు,సీనియర్ న్యాయవాది హరి అశోక్ కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు పి. సి. హన్మంత్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు బొల్లం విజయ్, కార్యదర్శి గౌరి శెట్టి విశ్వనాతం, కోశాధికారి వెల్ముల ప్రకాష్ రావు,ఆర్గనైజింగ్ కార్యదర్శులు పూసాల అశోక్ రావు, సంయుక్త కార్యదర్శి ఎం. డీ. యాకూబ్, ధర్మపురి అధ్యక్షులు కండ్ల గంగాధర్, కోరుట్ల అధ్యక్షులు పబ్బా శివానందం,మెట్‌పల్లి అధ్యక్షులు వొజ్జెల బుచ్చి రెడ్డి, జిల్లా, డివిజన్, మండలాల సీనియర్ సిటిజెన్స్ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# సామాజిక సేవ ద్వారానే ప్రజల్లో గుర్తింపు

**-జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్**



**చురకలు విలేకరి, రాయికల్, ఆగస్టు 13:** ప్రపంచంలోనే లయన్స్ క్లబ్, రోటరీ క్లబ్ లు అత్యంత ప్రాచీన సేవ సంస్థలని వీటి వేదికతో సామాజిక సేవ కార్యక్రమాలు చేపడితే ప్రజల్లో గుర్తింపు వస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. గురువారం రాయికల్ లయన్స్ క్లబ్ సభ్యులు తంగేళ్ల రమేష్ తండ్రి లింగయ్య జ్ఞాపకార్థం అందించిన బాడీ ఫ్రీజర్ ను అల్లిపూర్ గ్రామంలో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వాలే ప్రజలకు అన్నీ చేయలేవని స్వచ్ఛంద సంస్థలు కూడా ముందుకు రావాలని కోరారు.అత్యంత ధనిక దేశాల్లో స్వచ్ఛంద సంస్థలు సేవలు అందిస్తున్నాయని అన్నారు. భారతదేశం లో స్వచ్ఛంద సంస్థల పాత్ర అత్యంత ఆవశ్యకం అని ప్రతి ఒక్కరు వారి సంపాదనలో కొంత భాగం సేవ కార్యక్రమాలు చేయాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు వాసం ప్రసాద్,ప్రధాన కార్యదర్శి కనపర్తి శ్రీనివాస్,కోశాధికారి సుధవేణి మురళి,క్లబ్ సభ్యులు మచ్చ శేఖర్, దాసరి గంగాధర్,కొత్తపెల్లి రంజిత్,కుర్మ సుదర్శన్, సత్యనారాయణ, అశోక్, సర్పంచ్ ఎంబారి గౌతమి వెంకటేష్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రవీందర్ రావు,ముఖీద్,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సదుపాయాల సేకరణపై సమీక్ష సమావేశం



**-ఆగస్టు 21 వరకు గ్రామ స్థాయి సదుపాయాల సేకరణ కార్యక్రమం**

**- ఇబ్రహీంపట్నం తహసీల్దార్ వరప్రసాద్**

**చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం ఆగస్టు (13) :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని గ్రామాల్లో అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాల వివరాల సేకరణ కార్యక్రమం ఆగస్టు 21 వరకు కొనసాగనున్నట్లు తహసీల్దార్ వరప్రసాద్ తెలిపారు.ఈ మేరకు గురువారం తహసీల్దార్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, బీఎల్ఓలతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ గ్రామ ప్రజలకు అందుతున్న వివిధ సేవలు, మౌలిక సదుపాయాలపై సమగ్ర సమాచారం సేకరించనున్నట్లు తెలిపారు. గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల వివరాలతో పాటు ఆసుపత్రులు, త్రాగునీటి వసతులు, గ్రామపంచాయతీ కార్యాలయాలు, పరిశుభ్రత నిర్వహణ వ్యవస్థ, ప్రభుత్వ మరియు ప్రైవేటు పాఠశాలలు, పోస్టాఫీసులు, పశువైద్య ఆసుపత్రులు తదితర ప్రజా సేవా సంస్థల వివరాలను నమోదు చేయనున్నట్లు పేర్కొన్నారు.సేకరించిన సమాచారం ఆధారంగా గ్రామాల్లో అవసరమైన మౌలిక వసతుల కల్పన, ప్రజా సేవల మెరుగుదల,అభివృద్ధి పనుల ప్రణాళిక కు ఉపయోగపడుతుందని ఆయన వివరించారు.గ్రామాల్లో ఉన్న సదుపాయాల స్థితిగతులను అంచనా వేసి, అవసరమైన చోట కొత్త వసతుల ఏర్పాటు, సేవల విస్తరణకు చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు, సంస్థల ప్రతినిధులు సహకరించాలని తహసీల్దార్ వరప్రసాద్ విజ్ఞప్తి చేశారు.ఈకార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు,బిఎల్ ఓ లు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల పొలంబడి

**- రైతులతో ముఖాముఖి కార్యక్రమం**



**చురకలు విలేకరి ఇబ్రహింపట్నం అగష్టు (13) :** విద్యార్థులకు పుస్తక జ్ఞానంతో పాటు ప్రత్యక్ష అనుభవం ద్వారా వ్యవసాయం, రైతుల కష్టం, పంటల సాగు విధానాలపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో జగిత్యాల జిల్లా ఇబ్రహింపట్నం మండలం లోని వర్షకోండ ఎంపీపీఎస్ పాఠశాల ఆధ్వర్యంలో గురువారం పొలంబడి రైతులతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు సమీపంలోని వరి పొలాలను సందర్శించి, వరి నాట్లు వేసే విధానం, నారు పెంపకం, పొలాన్ని సాగుకు సిద్ధం చేయడం, నీటి నిర్వహణ, ఎరువుల వినియోగం, పంట సంరక్షణ, దిగుబడి వంటి అంశాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. వ్యవసాయ పనులను కళ్లారా చూసి విద్యార్థులు ఆసక్తిగా తెలుసుకున్నారు.అనంతరం రైతులతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో విద్యార్థులు వ్యవసాయం లో ఎదురయ్యే సవాళ్లు, రైతులు పడే శ్రమ, పంట సాగుకు అయ్యే ఖర్చులు, వాతావరణ పరిస్థితుల ప్రభావం తదితర అంశాలపై ప్రశ్నలు అడిగి తెలుసు కున్నారు. రైతులు విద్యార్థుల సందేహాలను నివృత్తి చేస్తూ వ్యవసాయ ప్రక్రియను సులభంగా వివరించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు రజిత, రైతు మీరా రాజేష్ పాల్గొన్నారు.